
దీపావళి నవల



ఇచ్ఛాపురపు జగన్నాథరావు

**అనూరాధ మరోసారి వాచీ చూసుకుంది.**

**ఎనిమిది గంటల పదహారు నిమిషాలు. అంటే ఈ బస్‌స్టాండులో రెండు గంటలసేపు నిలబడిందన్నమాట.**

**నిలబడి నిలబడి కాళ్ళు భరించలేనంతగా బాధపెడుతున్నాయి. భుజానికి తగిలించిన బేగ్ మణుగు బరువులాగ ఉంది. అందులో తనవి రెండు చీరలు, అత్యావసర సామగ్రి, డిగ్రీ సర్టిఫికెట్లు, చదువుకోడానికో కాలక్షేపం పుస్తకంకన్నా లేవు. కాని రెండు చేతులూ నొప్పి.**

వర్షం ధారాపాతంగా పడుతూనే ఉంది. చాలా వరకు తడిసిపోయి, చలి వేస్తోంది. మధ్యాహ్నం ఆ హోటల్లో తినలేక తినలేక తిన్నదాని తరవాత మళ్ళీ కాఫీ కూడా తాగలేదు.

రెండు గంటలకని చెప్పిన ఇంటర్వ్యూకోసం ఒంటి గంటకే వెళ్ళి కూర్చున్నా. వాళ్ళు నాలుగున్నర దాకా పిలవలేదు. పిలిచాక మళ్ళీ ఆలస్యం-ఆయనెవరికో టెలిఫోన్ వొచ్చింది.

చివరికి నిరాశగానే జరిగింది ఇంటర్వ్యూ.

ఎనాకమిక్స్‌లో నోబెల్ ప్రైజ్ ఎవరికొచ్చింది? ఎప్పుడు?

ఏమో, తనకేం తెలుసు? తనకి ఎకనామిక్స్‌లో ఒక డిగ్రీ వొచ్చింది. అయినా, ఆ అడిగిన వాళ్ళకి కూడా ఆ జవాబు తెలిసి నట్టులేదు.... "సారీ సర్! నాకు తెలీదు. దయ చేసి మీరు చెప్పండి" అంటే, ఒక వెర్రినవ్వు నవ్వి ఊరుకున్నాడు.

అంతరిక్ష యానంలో అత్యధిక కాలం గడిపిన వాళ్ళెవరు?

తనకేం తెలుసు! భూమిమీద నిలబడే హక్కు కోసం ప్రయత్నించడంలోనే సతమతమైపోతోన్న జీవితం తనది. అంతరిక్షం మాట అడిగితే ఏమి చెప్పగలదు?

"తెలుగులో జ్ఞానపీఠ్ ఎవార్డు ఎవరి కొచ్చింది?"

దానికి జవాబు చెప్పింది. అంతే, ఆ తరువాత మళ్ళీ గొప్ప గొప్ప విషయాల మీదకి వెళ్ళాయి ప్రశ్నలు. దేనికైనా తనకి సమాధానం దొరికిపోతుందని వాళ్ళ బెంగ. అది స్పష్టంగా తెలుస్తోనే ఉంది.

ఈ మాత్రందానికి ఇంతదూరం తనెందుకు పిలిచారో! బి.ఏ. పాసయిన వాళ్ళు కావాలని ప్రకటించారు—తనకి అర్హత ఉంది. తన ఇంగ్లీషు బాగుంటుంది. కాని, వాళ్ళ అవసరాలకీ, ప్రశ్నలకీ ఎక్కడా సంబంధంలేదు. తనకివ్వబోయేది గుమాస్తా ఉద్యోగం.

ఇవ్వబోయేది కాదు. అది తనకి రాదని తెలుసు.

ఆ మాట ముందరినించీ తెలుసు. కాని, ఆశఏమో! తనకి రాసిపెట్టి ఉందేమో!.... ఆ చిన్న ఉద్యోగంనించి ఈ పట్టణంలో కొంచెం మంచి ఉద్యోగం దొరికితే-తన ప్రస్తుతపు బాధలు కొంత అయినా తగ్గుతాయేమో!

నిట్టూర్చింది రాధ.

వర్షం కొంచెం వెలిసింది. కాని, ఎక్కడా బస్‌కాని, ఆటోకాని లేదు. నయం! దీపాలు వెలుగుతున్నాయి.

హైదరాబాదులో తనకి తెలిసినవాళ్ళెవరూ లేరు.

రైలుబండ్ల రాకపోకలు లేవు. రావాలసిన రైళ్ళు రాలేదు. బయలుదేరాల్సినవి బయలుదేరనూ లేదు. వర్షానికి గండ్లుపడి రాకపోకలు ఆగిపోయాయిట. మద్రాసు వెళ్ళాలంటే ఇంక ఎలాగో తెలీదు. బస్‌లో విజయవాడ వెళ్ళి అక్కడినించి ప్రయత్నిద్దామని అనుకుంటే, ఈ బస్‌స్టాండ్‌లో స్టాండింగే కాని బస్ లేదు. ఆటోలూ, రిక్షాలూ అన్నీ ఎక్కడా కనిపించ లేదు. బస్‌స్టాండ్‌లో నిలబడి ఉన్న చాలామంది నడిచి, ఒకటి రెండు స్నేహితుల కార్లలోనూ వెళ్ళిపోయారు. తానూ, ఇంకో ఇద్దరూ మిగిలిపోయారు. వాళ్ళు రౌడీల్లాగా ఉన్నారు. రాధకి కొంచెం భయంవేసింది. ఈ ప్రదేశం క్రమంగా నిర్మానుష్యం అయిపోతోంది.... వాళ్ళేమన్నా చేస్తే అరిచినా వినిపించుకునే వాళ్ళు దగ్గర్లో లేరు. షాపులు కూడా క్రమంగా మూసేస్తున్నారు. ఎదురుగా ఒక సిగరెట్ దుకాణం. దాని పక్కన



ఫ్యాన్సీ షాపూ మాత్రం ఉన్నాయి. వర్షంలో పోలేక కాబోలు వాళ్ళు ఇంకా దుకాణాలు మూయ్యలేదు. అదే ధైర్యం.

కాని ఈ రౌడీల్లాటి మనుషులిద్దరూ దేనికీ భయపడే లాగ లేరు.... తన చేతికి ఉన్న గాజులూ, వాచీ లాక్కుంటే తన చివరి ఆస్తులు పోతాయి.... మెడలో ఉన్నచైను రోల్డు గోల్డే కనుక బాధలేదు.... కాని, వాళ్ళకి మరో ఉద్దేశం ఉంటే....

అయినా, ఈ పరిస్థితుల్లో వాళ్ళకీ తన సమస్యే ఉంది. ఎక్కడికి తీసుకునిపోతారు?.... క్షణమాత్రంగా రాధకి అనిపించింది– ఎక్కడికైనా వాళ్ళు తీసుకుపోయి కూర్చోనిస్తే చాలా బాగుండునని, ఆ ఆలోచ నలాగే వొదిలేసింది. వాళ్ళు వెళ్ళిపోతారేమోనన్న భయం కూడా పట్టుకుంది. అప్పుడు తాను పూర్తిగా ఒంటరిగా మిగిలిపోతుంది. రెండు ఫర్లాంగుల అవతల రైల్వేస్టేషన్ ఉంది. అక్కడికి చేరితే ఎలాగో తల దాచుకోవొచ్చును. కాని, ఎలాగ?

ఒక కారు మరీ దగ్గరకు వొచ్చి పక్కనించి వెళ్ళింది. ఆమె బట్టలు తడిసిపోయాయి.

కోపం ముంచుకొచ్చింది. డర్టీ రాస్కెల్ అంది గట్టిగా. వినిపించుకోని కారు ముందుకు వెళ్ళిపోయింది.

రౌడీల్లాటి వాళ్ళిద్దరూ కూడా తడిసిపోయారు. తనకన్నా ఎక్కువగా తెలుగులో పచ్చిబూతులు తిట్టారు కారునీ, దాని డ్రైవర్‌నీ, వాడి అమ్మనీ, పిల్లల్నీ.... ఆ పరిస్థితిలో రాధకి వాళ్ళమీద సానుభూతీ, ఈర్ష్యా కూడా కలిగాయి. మగ జన్మ ఎత్తనందుకు ఆమె ఎప్పుడూ విచారించలేదుగాని, ఈ సారి వాళ్ళ భావప్రకటనలో ఉన్న స్వేచ్ఛకీ వాళ్ళ కోపంలో కొంత తగ్గడానికి ఉపయోగించిన ఆ భాషకీ ఆమె వాళ్ళని మెచ్చుకుంది.

వెనువెంటనే ఆమెకి తనపరిస్థితి జ్ఞాపకం వొచ్చి కన్నీళ్ళ పర్యంతం అయింది. ఈ రాత్రి అంతా ఎలాగ గడపడం? తరచుగా దుఃఖపడే వ్యక్తి కాదు రాధ. కాని, ఎన్నో కష్టాలు పడిన తన జీవితంలో ఇది అధమాధమమైన ఒక పరిస్థితిగా ఆమెకి అనిపించింది. రెండు ఫర్లాంగులు నడిచి రైల్వేస్టేషన్‌కి వెళ్ళడం తప్ప-వేరే మార్గం కనిపించలేదు.... వాళ్ళిద్దరూకూడా వొస్తే బాగుండును. కాని ఎలాగ అడగడం?

రెండడుగులు వేసి రోడ్ మీదకి వొచ్చింది.

మళ్ళీ వర్షం పడడం ప్రారంభమయింది.

అటు నించి కారు వొస్తోంది.రోడ్డు మీద నీళ్ళు.వెనక్కి వెళ్ళాలో, ముందుకు వెళ్ళాలోనని ఆలోచనలో తికమక పడిన రాధ అలాగే నిలబడిపోయింది. కారు లైట్లు ఆమె ముఖంమీద పడి క్షణికంగా ఆమె ఏమీ చూడలేకపోయింది. కారు కింద పడి హాస్పిటల్లోచేర్చినా కొంత సుఖం అన్న ఆలోచన ఆమెకి మెరుపులాగ వొచ్చింది.

కాని, అలాటి దేమీ జరగలేదు.

కారు రెండడుగుల అవతల నిలబడింది.

రాధ రోడ్డు దాటే ప్రయత్నంలో నాలుగడుగులు వేసింది.

కారు మరి కొంచెం ముందుకి వొచ్చి ఆమె పక్కన ఆగింది. "ఎక్కడికి వెళ్ళాలి?" అన్న మగ గొంతుక మాటలు వినిపించాయి.

వెనక్కి తిరిగి అతనెవరో చూద్దామని ప్రయత్నించింది రాధ. కాని, ముఖం కనిపించలేదు.


"స్టేషనుకీ" అంది నీరసంగా.

"ఏ స్టేషను?" అన్నాడతను మళ్ళా. వర్షంలో తడుస్తోన్న రాధకి విండ్ స్క్రీన్ మీద వైపర్లు పని చేయడం ఏదో విచిత్రంగా ఉంది. కారులో కూర్చున్న మనిషి వాటిని ఆపితే బాగుండును అనిపించింది.

"హైదరాబాద్...."

"లోపలికి రా.... లేక నడిచివెళ్లాలా ?"

తలుపుదగ్గరకి వొచ్చింది రాధ. అతను వొంగి, తలుపు తీసి, మళ్లా "గెటిన్" అన్నాడు. రాధ కూర్చుంది-అతనే ఆమె




మీదనించి వొంగి తలుపువేసి లాక్ చేశాడు.


ఒళ్ళంతా తడిసినా లోపలవెచ్చగా ఉంది. రాధ కూర్చోవడంతోనే సీటంతా తడిసిపోయింది. అయినా, నొప్పిపెట్టిన కాళ్ళలో ఒక్కసారి రిలీఫ్. ఎంత అలసిపోయి ఉందో అప్పటికి తెలిసింది రాధకి. ప్రతీ నరంలోనూ. ప్రతీ కణంలోనూ అనుభూతి. నొప్పిలోనూ, సుఖంలోనూ కలిసిన అనుభూతి.

కారు నెమ్మదిగా సాగిపోతోంది. నాలుగైదు నిమిషాల దాకా ఆమె అతనివైపు చూడలేదు. అతనూ మాట్లాడలేదు. అతి జాగ్రత్తగా కారు నడపడంలో నిమగ్నమైపోయాడు. రాధ అతన్ని చూస్తూ, "సారీ.... మీ కారు సీటు తడిపేశాను"అంది.

అతను తల తిప్పకుండానే, "ఫరవాలేదు...."అన్నాడు.

ఆ గొంతుక వినగానే అతన్నెక్కడో చూశానేమోనన్న ఆలోచన వొచ్చింది రాధకి. కాని,ఆమెకి ఏమీ జ్ఞాపకం రాలేదు.

"మీకు చాలా శ్రమఇచ్చాను" అంది.కృతజ్ఞతతో ఆమె



మనసు నిండిపోయింది. శారీరకంగా ఆమె అనుభవిస్తున్న సుఖం ఎంతో, ఎలాంటిదో అతనికి చెప్పాలని వుంది, అతన్ని ఆశీర్వదించాలని ఉంది. కాని మాటల్లో అంతకన్నా చెప్పలేక "థాంక్స్" అంది.

"ఫరవాలేదు.... కాని.... మీ పేరేమిటి?" అన్నాడు అతను. ఆమె జవాబు చెప్పేలోపులే "నా పేరు రాజశేఖర్" అన్నాడు.


"నాపేరు రాధ" అంది. అతని పేరు వినగానే ఆమెకి ఏదో లీలగా జ్ఞాపకం రావడానికి ప్రయత్నించింది. ఆ పేరు ఏ సందర్భంలోనో విన్నది- కాని, ఆ సందర్భం ఆమెకి జ్ఞాపకం లేదు. ఆ పేరుకి కాపీరైటు లేదు. అంచేత రాధ గతాన్ని తవ్వే ఆలోచన వొదిలి, "స్టేషన్ ఇటేనా? అంది. అప్పటికే కారు రెండు కిలో మీటర్లు పైగానే వెళ్ళిందనీ, కారు వెళ్ళిన దిక్కు కూడా వేరు అనీ ఆమెకి అనిపించింది.

"కాదు ఆ రోడ్‌లో రెండు చోట్ల నీరు మరీఎక్కువగా ఉంది.... మరో దారిన వెడుతున్నాము.... భయపడొద్దు. స్టేషన్‌కి తీసికెడతాను" అన్నాడు. అప్పుడు అతను ఆమెని కొంచెం పరీక్షగా చూశాడు. ఆమెకూడా అతన్ని చూసింది.

అతనికి సుమారు నలభై యేళ్ళు ఉండవచ్చును అనుకుంది రాధ. కళ్ళజోడువల్ల అతని ముఖం వయసు ఎక్కువగా ఉన్నట్టు కనిపించవొచ్చు. సైడ్ బర్న్స్. మీసాలు—అంత చిన్నవి కాకుండా. ఒత్తుగా జుత్తు.... నాటీఫార్టీస్ అని ఎక్కడో వింది రాధ. అయినా మరో పది నిమిషాలకన్న అతనితో సహవాసం ఉండబోదు కనుక, ఇంక అతన్ని గురించి ఆలోచించదలచుకోలేదు. చిరునవ్వుతో తలఊపి, రోడ్ మీదకి చూస్తూ కూర్చుంది.

రాజశేఖర్ ఆమెనే చూశాడు. మట్టిలో మాణిక్యంలాగ ఉంది అనుకున్నాడు. ఇరవై రెండు ఇరవై మూడు సంవత్సరాల వయసుఉండాలి.... తడిసి, అలిసిఉంది.... కానిసుళువుగా భయపడే అమ్మాయిలాగ లేదు. ఇంటరెస్టింగ్—అనుకున్నాడు. ఈ సమయంలో, ఆ నడిరోడ్డుమీద వర్షంలో కారుకి ఎందుకు అడ్డుగా వొచ్చిందో!.... చక్కటి అమ్మాయిలాగ ఉంది. అలంకరించుకుని ఉన్న అమ్మాయిల అందచందాలు అంచనా వెయ్యడం కష్టం కాని, ఇలాగ తడిసి ఉన్నవాళ్ళకి నిస్సందేహంగా సరియైన మార్కులు వెయ్యవొచ్చును. ఎప్పుడోగాని, ముఖ సౌందర్యం విషయంలో పొరపాట్లు జరగవు. అందులో శేఖర్ చాలా అనుభవంగల మనిషి.

కాని, అనూరాధని గురించి అంతకన్నా ఆలోచించదలుచుకో లేదతను....అతని మనస్సులో గంట క్రిందటిదాకా జరిగిన విషయాలు మంటలని పుట్టిస్తున్నాయి. తనకిఉన్నఒకే ఒక పాప.... తన బంగారుతల్లి అనుకున్న రాధిక.... ఇవేళ తనని దూరందూరంగా ఉంచింది. ఎప్పటిలాగా తనని చూడగానే, "డేడీ! డేడీ!" అంటూ కౌగిలించుకోలేదు.... నెల రోజులు ఎందుకు కనిపించలేదని కోపం తెచ్చుకోలేదు.... వెయ్యి






ప్రశ్నలు వెయ్యలేదు. అతిథిని చూసినట్టు చూసింది-వెళ్ళి వొస్తానంటే సరే అంది-పెద్దబరువు వదిలినట్టు.తననీ మద్రాసు తీసుకుని వెళ్ళమనలేదు.... తానెంతో అభిమానంతో తెచ్చిన ఇంగ్లీషు చాక్లెట్ల పేకెట్ విప్పలేదు. మిగిలిన బహుమతులేమిటో కూడా చూడలేదు. ఒక్కనెలలో అంత మార్పు ఎందుకు వొచ్చిందో!

ఆ ఆలోచనలని వెనక్కినెట్టి, ఈ అనూరాధని త్వరగా వొదిలించుకోవాలనే ఉద్దేశం వొచ్చినట్టు కారుని మరి కొంచెం వేగంగా పోనిచ్చాడు శేఖర్. తొమ్మిది దాటేసరికి ప్రిన్స్ వొస్తాడు—ఎవరో ఒక అమ్మాయిని తీసుకుని. వాడి వ్యాపారానికి చిన్నరకం పోషకుడు తాను. తనని వాడూ మరిచిపోడు.... వాడిని తానూ వొదలడు.

మరో పది నిమిషాలకి అతని కారు స్టేషన్ ముందు ఆగింది. రోడ్డు మీదకన్నా స్టేషన్ ముందు నీళ్ళు ఎక్కువ ఉన్నాయి. లోపలకి వెళ్ళేందుకు కూడా వీలు లేకుండా, స్టేషన్ నిండా మనుషులు. వరండాలో కూడా వొందల మంది నిలబడ్డారు— సగం తడుస్తూనే. లోపల ఎలాగ ఉంటుందో ఊహించుకోవడం సులువు.

అనూరాధ కారు దిగి బేగ్ తీసుకొని. "రాజశేఖర్ గారూ! చాలా థేంక్స్! దైవంలాగ వొచ్చి సాయం చేశారు" అంది దిగడానికి తయారవుతూ.

"అంత మాటలు వొద్దు—ఏ రైలుకి వెళ్ళాలి? అది ఉందో లేదో కనుక్కుంటే మంచిది" అన్నాడు.

ఒక పోర్టర్ వొచ్చి. "ఎక్కడికి వెళ్ళాలి?— రైళ్ళు లేవు—ఏ బండీ రేపటిదాకా బయలుదేరదు" అన్నాడు. హిందీ,ఉర్దూ కలిపి.

రాజశేఖర్ అనూరాధవేపు చూసి "విన్నారా?" అన్నాడు.

"విన్నాను.... అయినా. ఫరవాలేదు. వెయిటింగ్ రూమ్‌లో పడుకుంటాను." అంది అనూరాధ.

పోర్టర్ నవ్వుతూ, "పడుకోవడమా?—అడుగు పెట్టడానికి జాగాలేదు-గ్లాసుడు నీళ్ళుకూడాదొరకడం లేదు" అన్నాడు.

"అయినా ఫరవాలేదు.... ఎలాగో గడుపుకుంటాను" అంది అనూరాధ దిగి మరోసారి థాంక్స్ చెప్పి. పోర్టర్‌కి ఒక రూపాయి ఇచ్చి శేఖర్ ముందుకి సాగిపోయాడు.

హోటల్‌కి చేరడానికిపదిహేనునిమిషాలు....అంటేసరిగ్గా తొమ్మిదయేసరికి అక్కడ ఉంటాడు. ప్రిన్స్ వొచ్చి తన కోసం చూస్తూ ఉంటాడు. మంచి అమ్మాయిని తీసుకొస్తాడు. వేడిగా స్నానం చేసి, వెచ్చగా విస్కీతాగి....

అతను రాధికనీ. ఆ సాయంత్రం జరిగిన దాన్ని గురించి మరిచిపోయే ప్రయత్నంలో రాత్రి గురించి. కలలు కంటూ రేడియోపెట్టేడు.

అతనాశించిన సంగీతం రాలేదు.

కాని. "రైళ్ళ. బస్సుల రాకపోకలు మళ్ళీ ఇరవైనాలుగ్గంటలదాకా ప్రారంభించే అవకాశంలేదు.... అన్న మాటలతనికి వినిపించాయి ఆసక్తిగా విన్నాడు. హైదరాబాదునుంచి విజయవాడ దాకా జరిగిన వర్షపు బీభత్సం గురించి వార్తలు వొస్తున్నాయి. ఏ రైలు హైదరాబాద్ నించి బయలుదేరేందుకు వీలులేదని అతనికి బోధపడగానే అనూరాధ జ్ఞాపకం వొచ్చింది. ఆ స్టేషన్‌లో జనసందోహం, పోర్టరు చెప్పిన మాటలు కూడా జ్ఞాపకం వచ్చాయి.

అతను కారు ఆపి నిమిషం ఆలోచించ లేదు.... అతనికి అనూరాధని మళ్ళీ చూడాలని అనిపించింది..... ఆ స్టేషన్‌లో ఆమె ఉండి నానా యాతనాపడడం అతనికి బాధ అనిపించింది.

మళ్ళీ కారు స్టార్టు చేసి స్టేషన్‌కి వెళ్ళేడు. కారు ఆపేసరికి ఇందాకటి పోర్టర్ వచ్చి. "ఏం బాబూ? మళ్ళీ వచ్చారేం?" అన్నాడు.

"ఇందాకటి అమ్మాయి— ఎక్కడుంది?" అన్నాడు. శేఖర్ కారు దిగుతూ.

"చూస్తాను" అంటూ పోర్టర్ లోపలికి వెళ్ళేడు.

రాజశేఖర్ కూడా లోపలికి వెళ్ళేడు. అంతా చీదర. ఎక్కడా ఖాళీలేదు. నడవడానికి కూడా కష్టంగా ఉంది. తోసుకుంటూ, హాలు అంతా తిరిగాడు. కిందన తడి. బురద. గోల. వాసన.

లేడీస్ వెయిటింగ్ రూముకి వెళ్ళేడు. అక్కడ కనీసం

## పునరుద్ధరింపలేని కల

ఈ లోకం రంగుల కల
చెదరని నవ్వు
నియాన్‌లైట్ల వెలుగు
చీకట్లో లేచిన ఆనందపు గగనం
కేరింతాలు కొడుతోన్న
అవిశ్రాంత సంగీతపు అల.

వీళ్ళు
దుఃఖానికి అతీతులు
వీళ్ళలో నాగరికత విక్షిప్తమై
నిక్కినిక్కి చూస్తోంది
వీళ్ళు జీవితాన్ని చెరబట్టారు
దాన్ని మరుస్తున్నారు.
గ్లాసుల్లో విస్కీతో కొలుస్తున్నారు.
వీళ్ళు త్రుళ్ళిపడే సెలయేటి లాంటి
అడుగుల్తో ఎటో పోతున్నారు
చీకటి చిక్కనయ్యింది
చచ్చిపోయిన సిగ్గుని సిగలో
ముడుచుకొంది
ఇప్పుడు నేనొక్కడ్ని లేస్తాను
వీళ్ళకి స్వర్గసుఖాల్ని
చవిచూపిన నా నరకంలోంచి

ఈ రోడ్డుమీదే అడుక్కొనే
కుంటి తమ్ముణ్ణి.
గుడ్డి చెల్లెళ్ళి చూస్తాను.
అవును. ఇలాగే.
నా వాడిపోయిన జీవితం కూడా
కుంటిది.
అంతేకాదు గుడ్డిది.

నాకు తెలుసు—
నా ఆశలు శూన్యంలో చుక్కలవీ.
అవి రాలిపోయిన ఉల్కలవీ
వీటిని ఏరుకుంటూ—
చీకటి గదుల్లో మానసిక
వ్యభిచారం చేస్తూ.

కాదు. కాదు.
క్షణక్షణం నన్ను నేను చంపుకుంటూ.
ఇదీ బ్రతుకు....చావో?
చావులాంటి బ్రతుకో? ఇది.
మళ్ళీ రేపటి రాత్రి మామూలే!
చిర్నవ్వుని పులుముకొని
ఆత్మీయంగా పలకరిస్తో—
నా జీవితం చుక్కని
ఈ Hotel లో పొడిపిస్తూ.
Counter లో
విషాదాన్ని. ప్రమోదాన్ని
బేరీజు వేసుకొంటూ—
ఈ లోకం కలల అలల
మీద నొక్కుతో.

—ఎస్. ఏ. రవూఫ్

రెండు వొందల మంది ఉన్నారు. ప్లాట్‌ఫామ్‌మీద మనుషుల్ని తప్పించుకుంటూ నెమ్మదిగా అడుగులువేస్తూ అటూ ఇటూ వెతుకుతోంటే పోర్టర్ వచ్చి, "రండి" అని అతన్ని తీసి కెళ్ళాడు. మూసి ఉంచిన కేంటీన్ పక్కన నలుగురి మధ్య ముడిచిపెట్టుకుని కూర్చుని ఉంది అనూరాధ. తల దించుకుని ఆలోచిస్తోంది. అతన్ని చూడనే లేదు.

"అనూరాధా!" అని పిలిచేడు.

తల ఎత్తి చూసింది. "మీరా!" అంది. వెలుతురులో అతను స్పష్టంగా కనిపిస్తున్నాడు.

"ఇక్కడ ఎలాగ ఉంటారు? రేపు కూడా రైళ్ళు ఉండవు. నాతో రండి" అన్నాడు ఆజ్ఞాపిస్తోన్నట్టు. అతను కొంచెం తడిశాడు. జోళ్ళ లోపలికి వెళ్ళిన నీరు చిరాకు కలిగిస్తోంది.

ఏదో అనబోయింది అనూరాధ.

"కమాన్" అన్నాడు రాజశేఖర్, అనూరాధ లేచి నిలబడి అతన్ని అనుసరించింది. ప్రాణం పోయినా నీతో రాను అని ఆమె అందామని అనుకున్న మాటలు గొంతులోనే ఉండి పోయాయి. ఆ తడి చీదరలో పది నిమిషాల అనుభవం ఆమెని దేనికైనా సిద్ధపడేలాగ చేసింది.

కారెక్కుతూ, "ఎక్కడికి? మీ ఇంటికా?" అంది అనూరాధ.

"కాదు హోటలుకి" అన్నాడు రాజశేఖర్.

క్షణం ఆగి, డోరు తానే వేసింది అనూరాధ.

## 2

రిసెప్షన్‌లో రూము తాళం, దానితో ఇచ్చిన మెసేజ్




కూడా తీసుకుని లిఫ్టులో అయిదో ఫ్లోర్‌కి వెళ్ళేడు రాజశేఖర్. అనూరాధ నిశ్శబ్దంగా అతన్ని అనుసరించింది.

"మీరు వెళ్ళి ముందర స్నానం చెయ్యండి. బట్టలు మార్చుకోండి" అన్నాడు రాజశేఖర్ కోటు, టై, తీసివేస్తూ.

నీరసంగా కుర్చీలో కూర్చుంది అనూరాధ.

"కాఫీ కావాలా?" అన్నాడు రాజశేఖర్.

"అవును" అంది అనూరాధ.

రూమ్ సర్వీస్‌కి చెప్పి, కాఫీ, పకోడాలూ ఆర్డర్ చేశాడు. "అవి వొచ్చేసరికి పది నిమిషాలు అవుతుంది" అన్నాడు.

బేగ్ తీసుకుని బాత్‌రూమ్‌కి వెళ్ళింది అనూరాధ.

"వేడినీరు ఉంది- చూపుతాను" అంటూ ఆమెతో వెళ్ళి టబ్‌లో బకెట్‌పెట్టి నీళ్ళు వదిలి. "షాంపూ ఇక్కడ ఉంది.... టవల్స్—సోప్ ... ప్లీజ్ యూజ్‌దెమ్" అని, ఇవతలికి వొచ్చాడు.

మెసేజ్: ప్రిన్స్‌నించి.

"పదిగంటలకి వొస్తాను— కొంచెం ఆలస్యం కావొచ్చును" అని.

అదీ మంచిదే అనుకున్నాడు రాజశేఖర్. అప్పటికి అనూరాధని మరో రూమ్‌లో పెట్టవచ్చు. రిసెప్షన్‌కి ఫోన్‌చేసి, మరో రూము కావాలని అడిగాడు, అరగంటలో చెప్తామన్నారు.

అతను విస్కీబాటిల్ తీసి గ్లాసులో విస్కీ వేసుకుని కొంచెంనీళ్ళు కలిపి, కుర్చీలో కూర్చుని విశ్రాంతిగా తీసుకుని రెండు గుటకలు వేసుకున్నాడు, ఏమి రోజు! వర్షపు ఉధృతం... అక్కడ రాధిక తనతో ముభావంగా ఉండడం- ఉదయం మీటింగ్- రాత్రి ఈ అనూరాధ ...

"ఏమమ్మా! డాడీకి దూరంగా ఉన్నావేం? కోపం వొచ్చిందా?" అని తాను మూడుసార్లు అడిగాడు.

"లేదు డాడీ!.... నేను మామూలుగానే ఉన్నాను కదా!" అంది బేబీ.

"మమ్మీ ఏమైనా అందా?"

బేబీ తల ఊపింది— బేబీకి అబద్ధం చెప్పడం చాత కాదు. బహుశా, తల్లి ప్రయత్నాలు ఫలించి ఉంటాయి.

నిట్టూర్చాడు. జీవితంలో అన్నీఉంది. ఏమీలేని పరిస్థితి నించి ఇన్నాళ్ళూ తన బేబీ రాధిక రక్షించింది. దానికీ పన్నెండు నిండాయి కదా! ఆలోచనలూ, అభిప్రాయాలు రూపు దిద్దుకునే తొలి వయసు. ఆ పసి మనసుని విషపూరితం చెయ్యడానికి ఒక్కబొట్టు విషం చాలు. పార్వతికి తనమీద పగ ఇంకా పోలేదు. నిజానికి ఆమె ఆ పగనలాగే జాగ్రత్తగా పెంచుకుంటూ ఉంటుంది.

విస్కీ సగంతాగి బల్లమీద పెట్టి సిగరెట్ వెలిగించాడు. శవపేటికకి దిగగొట్టే తెల్లమేకులని అంటాడు డాక్టర్ వాటిని. కాని, రాజశేఖర్ పట్టించుకోడు. ఈ చిన్న చిన్న సంతృప్తులనైనా ఉండనీ జీవితంలో! పోయేవాడు ఎలాగా తప్పదంటూ వేదాంతీకరిస్తాడు.

ఫోన్‌వొచ్చింది. రిసీవర్ తీసేసరికి "డాడీ!" అంటూ రాధిక.

కూతురి గొంతుక వినేసరికి అతనికి ఆనందం కలిగింది. కాని, ఆమె మాటలు వినగానే అది ఒక్కసారి మాయమైంది.

"వొచ్చే నెల.... మమ్మీతో ఢిల్లీ వెడతాను డాడీ! మీకు చెప్పడం మరిచిపోయాను.... అందుకని...." కొంచెం సంశయించింది.

"అందుకని డాడీ రాకూడదు. అంతేనా?"

"యస్ డాడీ!...."

మనసులో బాధనంతనీ అణచుకుని, "సరేనమ్మా" అన్నాడు రాజశేఖర్.

"మరొకటి, డాడీ!"

"చెప్పు" ఆమె చెప్పబోయేది కూడా సంతోషం కలుగజేసేది కాదని అతనికి ముందే తెలిసింది.

"మీరు వొచ్చేటప్పుడు ఇవన్నీతేవద్దు డాడీ! మమ్మీ అన్నీ ఇస్తుందిగా! యూ నీడ్ నాట్ బాదర్. ఓ.కే?"

బేబీ వెనకాల పార్వతి నిలబడి ఉందని అతనికి తెలుసును. రిసీవర్ విసురుగా పెట్టబోయి వెనక్కి తీసుకుని, "ఓ.కే. బేబీ! చాలా పెద్దదానివి అయిపోయావు" అన్నాడు.

"యస్ డాడీ! గుడ్‌నైట్" అని, రాధిక డిస్కనెక్ట్

చేసింది. ఆజ్ఞ ప్రకారం నడుచుకుంది అన్నమాట రాధిక.

ఏడవాలనిపించింది రాజశేఖర్‌కి.

కాని శేఖర్ ఏడ్చే మనిషి కాదు—అలవాటూ లేదు: శక్తీ లేదు.

విస్కీ పూర్తిచేసి మళ్ళీ పోసుకున్నాడు.

బాత్‌రూమ్‌లోనించి అనూరాధ వొచ్చింది- పూర్తిగా మారిపోయింది.సింపుల్ వాయిల్ చీర, పరిశుభ్రమైన శరీరం, అందంగా వేలాడుతోన్న నల్లని జుట్టు.... అరగంటలో కొత్త జన్మ ఎత్తినట్టు ఉంది ఆమె.

ముఖాన ఎర్రటి బొట్టు—

అదే క్షణంలో డోర్.బెల్. రూమ్ సర్వీస్ నించి కాఫీ, స్నాక్సూ వచ్చాయి.

"కమాన్" అన్నాడు.

రెండోసారి పిలవనక్కర లేకుండానే థాంక్స్ చెప్పి అనూరాధ రెండు పకోడాలు తిని కాఫీ తాగింది. ఆమె ప్రాణానికి హాయిగా ఉంది.

"థాంక్స్!" అని, "సారీ! మీరూ ఒక పకోడా తినండి అడగడమే మరచిపోయాను" అంటూ ప్లేటుఅతనికి ఇచ్చింది ఒకటి తీసుకుని తింటూ. "మీరు ఉండేది- మద్రాసు అనుకుంటాను" అన్నాడు రాజశేఖర్.

"అవును. మీకు జ్ఞాపకం వొచ్చిందన్నమాట" అంది గంభీరంగా మారిపోయిన అనూరాధ.

"ఇప్పుడే జ్ఞాపకం వొచ్చింది."

"అయితే. నేనింక సెలవు తీసుకోవడం మంచిది"అంది అనూరాధ.

రాజశేఖర్ చిరునవ్వుతో, "ఎందుకని?.... భయంగా ఉందా?" అన్నాడు.

"అంత సుళువుగా భయపడనని తెలుసు మీకు"అంది రాధ.

"అలా అనుకోను.... కాని. లెటజ్ ఫర్గెట్ ఇట్. ఆ రోజు తాగి ఉన్నాను," అన్నాడు లేచి నిలబడుతూ.

"ఇవేళా తాగి ఉన్నారు" అంది అనూరాధ.

"నో. ఇంకా ప్రారంభంలోనే ఉంది. డోంట్ వర్రీ—నేను పది నిమిషాల్లో వొస్తాను." అని, రాజశేఖర్ బాత్ రూముకి నడిచాడు.

అనూరాధ కూర్చుని ఏం చెయ్యడమా అని ఆలోచిస్తోంది.

సుమారు మూడేళ్ళయింది— ఈ రాజశేఖర్‌ని కలుసుకుని.

అప్పటికి తనకిఉద్యోగం లేదు.అమ్మ రోజూసాధింపు. సవతితల్లి కావడాన ఆమెకి మరీ కసిగా ఉండేది. భూషణంని పెళ్ళి చేసుకుంటే ఆమె బహుశా కొంత సంతృప్తి పడిఉండేది అతనావిడకి తమ్ముడు, రౌడీతనం—చదువు సంధ్యలు లేనట్టే లెక్క. నాన్న పోతూ పోతూ ఆస్తుల్లో సగం తనకీ, సగం ఈ అమ్మకీ రాసి పోయాడు, ఉన్నది ఎక్కువ లేదు. అప్పులు చేశాడంటూ తన వొంతుకి వొచ్చినవి చాలా వరకూ అమ్మే



శారు. ఆ తరవాత తనకి జరిగిన మోసం తెలిసి ఉన్న ఇల్లు మాత్రం అమ్మకుండా ఆపింది. అదీ బలవంతాన తన చేత అమ్మించే వాళ్ళే.... భూషణం ఒకసారి చెయ్యి చేసుకో బోయాడు కూడాను. కాని, లాయరుగారు గట్టిగా చెప్పడంతో అక్కడ ఉండే ఆస్కారం కూడా ఉండదన్న భయంతో అమ్మ ఆ ప్రయత్నాలు మానుకుంది. భూషణం తరుచూ వొస్తూవుండే వాడు. వొచ్చినప్పుడల్లా అతనిది ఒక్కటే ఉద్దేశం. తనని లొంగదీసుకోవాలని. అతని 'మగసిరి'కి తాను దాసోహం అని అతనికి లొంగిపోయి, ఆ కరుణా కటాక్షాలని ఆమె పొందాలని అతని ఉద్దేశం. తనమీదతనకి చాలా గొప్ప అభిప్రాయం వుండేది. ఆ అభిప్రాయం అనూరాధకు లేకపోవడం అతనికి ఆశ్చర్యాన్నీ, తరవాత కోపాన్నీ కలిగించింది. మోహనరాగం మార్చి భైరవిలో పడ్డాడు. బలానికి ఏ ఆడదైనా లొంగిపోతుం దని అతని సూత్రం. అదీ చాలా వరకు తన మీద ప్రయోగం చేశాడు. చివరికి ఒకనాడు పెద్ద రభస చేసి, అమ్మని కూడా ఆ ఇంట్లోనించి పొమ్మన్నాక అతని రాక పోకలు తగ్గాయి.

క్రమంగా ధన లోపం తెలిసి వొచ్చింది. ఇంటికి అద్దె లేదు-స్వంతం కనక. ఆవిడ భూములూ, తోటా ఎప్పుడో అమ్మేసింది. తినడానికి కూడా తన నగలు ఒకటీ ఒకటీ అమ్మే పరిస్థితికి వొచ్చాక ఉద్యోగం కోసం ప్రయత్నం చేసే సమ యంలో సరళ చెప్పింది- ఫలానా కంపెనీకి జనరల్ మేనేజరుగా వున్న శేఖర్ దగ్గరకి వెళ్ళమని. ఎన్నిసార్లు వెళ్ళినా ఇంట ర్వ్యూ దొరకలేదు. ఎన్ని అప్లికేషన్లకీ జవాబు లేదు. ఆ పరి స్థితుల్లో సరళ సలహా మీద అతని ఇంటికి వెళ్ళింది. చిన్నప్పటి నించీ ఆమెకీ, తనకీ స్నేహం. సరళ కూడా తనలాగే గ్రాడ్యు యేట్ మాత్రమే అయినా, మంచి వుద్యోగం చేస్తోంది. "నువ్వు ఈ సాయంత్రం ఏడు దాటాక వెళ్ళు. నేను అన్నీ మాట్లా డాను. నీవు మరీ ముడుచుకుపోకు. అతను చాలాసరదా అయిన మనిషి. నీకు వుద్యోగం ఇస్తాడు" అంటే వాళ్ళకి మంచి స్నేహం ఉందని నమ్మి వెళ్ళింది. తాను ఏడుకు వెడితే అతను ఎనిమిదిన్నర దాటాక వచ్చాడు. బాగానే పలకరించాడు. మర్యాద చేశాడు-తనకి కాఫీ ఇచ్చి ఇవాళలాగే విస్కీ,తాగుతూ కూర్చున్నాడు.

ఎన్నో ప్రశ్నలడిగాడు తనని మర్యాదగానే. మధ్య మధ్య అతనికేవో టెలిఫోన్లు వస్తున్నాయి, ఓపిగ్గా సమాధానం చెప్పింది.

చివరికి తాను వెళ్ళడానికి లేచింది. "డోంట్ గో.... కమాన్" అంటూ అతను బెడ్ రూముకి దారి తీశాడు. ఏం జరుగుతోందో తెలీని తానతని వెనకాలే వెళ్ళింది. లోపలికి వెళ్ళి అతను తలుపు వేశాకగాని అతని ఉద్దేశం తెలీలేదు.


"యువార్ బ్యూటిఫుల్" అన్నాడు మీదని చెయ్యివేస్తూ.


విదిలించుకుని బయటకి రాబోయింది.

అతను అడ్డువచ్చాడు.

"ఏం? మనస్సు మార్చుకున్నావా?" అన్నాడు.

"ఇలాగ చేస్తారని— ఇలాటి ఉద్దేశం అని తెలిస్తే



వొచ్చేదాన్ని కాదు" అంది అనూరాధ.

"డోంట్ టీజ్ మీ...." అంటూ ఆమెని దగ్గరగా లాక్కున్నాడు రాజశేఖర్. అతని మాటలు కొంచెం ముద్దగా వొస్తున్నాయి. ఆమెను ముద్దు పెట్టుకున్నాడు.

అప్పుడు చెయ్యి చేసుకుంది అనూరాధ. శక్తికొద్దీ చెంపమీద కొట్టింది.

కోపంగా, బలంగా ఆమె చెయ్యి పట్టుకున్నాడు రాజశేఖర్. చెయ్యి విరుగుతుందేమోనని భయం వేసింది ఆమెకి.

"స్టుపిడ్ గర్ల్! మరెందుకొచ్చావిక్కడికి?" అంటూ ఆమెని చెంపమీద కొట్టేడు.

వెనుగులాడుతూ, "నేనా ఉద్దేశంతో రాలేదు. జాబ్ ఇస్తారని చెప్తే వొచ్చేను" అంది అనూరాధ. చెంప మండుతోంది. చెయ్యి నలిగి నొప్పి పెడుతోంది. ఎంత ఆపుకుందామన్నా, ఆమె కళ్ళ నించి నీళ్ళు వొచ్చాయి.

"ఇడియట్!— నా సాయంత్రం అంతా పాడుచేశావు. ఈ సమయంలో ఇక్కడికి అమెరికా ఎలెక్షన్లు చర్చిద్దామనుకుని వొచ్చావా?" అన్నాడు రాజశేఖర్ ఆమెని వొదిలేస్తూ. ఆమె వెళ్ళి తలుపు తియ్యబోయింది. రాలేదు.

"పోయి ముఖం కడుక్కో...." అంటూ ఆమెని బాత్ రూమ్‌లోకి తోశాడు. నిమిషంలో బయటకి వొచ్చింది. అతను సిగరెట్ కాల్చుతూ మంచం మీద కూర్చున్నాడు. ఆమె తలుపు తీసే ప్రయత్నం మళ్ళీ చేసింది.

"దానికి లాక్ వుంది...." అంటూ అతను లేచి ఆమె దగ్గరకి వచ్చాడు. ఆమె భయంతో ముడుచుకుపోయింది.

"యువార్ రియల్లీ బ్యూటిఫుల్!— ఉద్యోగం నిజంగా కావాలంటే మళ్ళీ వారంరా....పిటీ పిటీ" అంటూ నిట్టూర్చి అతను తలుపు తీశాడు— ఆమె త్వరత్వరగా వెళ్ళబోతుంటే భుజం పట్టుకుని ఆపి, "కార్లో వెళ్ళు రాత్రి సమయం" అన్నాడు.

"అక్కర్లేదు" అంది వొస్తోన్న దుఃఖం ఆపుకుంటూ అనూరాధ.

"అనూ! నా మాట విను. నీకున్న ధైర్యం నాకు లేదు. నీ మూర్ఖత్వమూ నాకు లేదు. నా కారెక్కితే నీ శీలం చెడిపోదు" అంటూ డ్రైవర్‌ని కేక వేశాడు. వెంటనే వాడు వొస్తే కార్లో కూర్చోబెట్టి, "ఫర్గెట్ ఏ బేడ్ డ్రీమ్! మేక్ ఏ గుడ్ డ్రీమ్" అన్నాడు చిరునవ్వుతో. కారు సాగిపోయింది.

అదే అతనితో చివరి పరిచయం.

మళ్ళీ ఈనాడు.

టెలిఫోన్ మోగింది. సంశయిస్తూనే రిసీవర్ తీసింది అనూరాధ.

రిసెప్షన్ నించి.

ఎంత ప్రయత్నించినా మరొక రూమ్ ఖాళీలేదనీ, ఊరిలో అన్ని హోటళ్ళూ ఫుల్ అనీ, క్షమించమనీని.

అనూరాధకి అర్థమైంది- అతనింకో రూమ్ కోసం ప్రయత్నించాడని.

ఇంతలో ఫ్రెష్‌గా రూమ్‌లోకి వొచ్చాడు రాజశేఖర్. పైజమా, కుర్తా వేసుకున్నాడు. పరిమళాలు వెదజల్లుతున్నాడు.




రిసెప్షన్ నించి వొచ్చిన మెసేజ్ చెప్పింది అనూరాధ.

అతను మళ్ళీ రిసెప్షన్‌కి ఫోన్ చేశాడు. అనుకున్న చెకౌట్స్ ఏవీ కాలేదనీ. నలుగురు లాబీలో రూమ్‌కోసం కూర్చుని ఉన్నారనీ క్షమాపణలతో సహా చెప్పేరు వాళ్ళు. ముఖం చిట్లించాడు.

"నా కోసమా రూము?" అంది అనూరాధ.

"అవును."

"థాంక్స్!.... మీరు శ్రమపడకండి. ప్రాణం పోసినంత హాయిగా ఉందినాకు. రాత్రి ఎక్కడికైనా వెడతాను...."

"ఎక్కడికి?— ఫ్రెండ్స్— రిలేషన్స్— ఎవరైనా ఉన్నారా?"

"లేరు—కాని...."

"....కాని.... చెప్పండి?"

"ఏదో ఒకటి చేస్తాను—మీకు ఇప్పటికే, క్షమించవలసినదానికన్న ఎక్కువ శ్రమ ఇచ్చాను.... అసలు నేనెవరో తెలిస్తే మీరు, మీ కారు ఆపి ఉండేవారే కాదు...."

"నేనెవరో తెలిస్తే నువ్వు— మీరు—"

"నువ్వనండి, ఐ డోంట్ మైండ్"

"థాంక్స్! నేనెవరో తెలిస్తే నువ్వు కారెక్కి ఉండేదానివి కాదు," అన్నాడు రాజశేఖర్ చిరునవ్వుతో.

"అది నిజం" అంది అనూరాధ. కాని లోలోపల ఆమెకి అనుమానంగా ఉంది-అది నిజమేనా అని.

"ఆ రైల్వేస్టేషన్‌కి వెడితే— నేనే మళ్ళీ తీసికెళ్ళాలి. ఫరవాలేదు— కాని రెండు గంటల్లో నీకు పిచ్చి ఎక్కుతుంది.... బహుశా నాకూను" అన్నాడు రాజశేఖర్.

"మీ కెందుకు పిచ్చి ఎక్కడం?"

"చెప్పినా నీకు తెలీదులే."

"నేను వెళ్ళాలని మీకు లేదు— నాకు తెలుసును. ఉండాలని నాకు లేదు అని మీకూ తెలుసు."

"పొరపాటు అనూ! నువ్వు వెళ్ళాలనే ఉంది నాకు. కాని, దిక్కుమాలినదాని లాగకాదు."

దానికి కారణం అడిగేలోగా డోర్ బెల్ వినిపించి తలుపుతీశాడు రాజశేఖర్. ముందు ప్రిన్సూ. వెంట మెరుపు

తీగలాటి అమ్మాయిలా లోపలికి వచ్చారు.

"నమస్తేసార్! నమస్తే!.... నేను వెళ్ళి వస్తాను.... ఉదయం ఆరుకల్లా అమ్మాయి వెళ్ళిపోవాలి. స్మితా! సాబ్‌కి సలామ్ చెయ్యి!.... మిమ్మల్ని చూసి నెలరోజులైపోయింది సార్! స్మిత కాలేజీ బ్యూటీ సర్! వండ్రఫుల్ గర్ల్!..." అంటూ ఇంకా ఏమో చెప్పబోయి ఆగిపోయాడు— అతనికా క్షణందాకా అనూరాధ కనిపించలేదు.

"నిమిషం కూర్చో...." అన్నాడు రాజశేఖర్.

"నేను నిలబడే ఉంటాను సార్!.... స్మితా కూర్చుంటుంది."

స్మితా కూర్చుంది.

అనూరాధ ఆమెని వొద్దనుకుంటూనే చూసింది. బంగారు బొమ్మలాగ ఉంది స్మిత. ఆమె ముందు తను దివిటీ ముందరి దీపంలాగ ఉంటుందని అనుకుంది.

ఎవరి కెవరినీ ఎవరూ పరిచయం చెయ్యలేదు.

స్మిత గదిచుట్టూ ఒకసారి చూసి తల వొంచుకుని కూర్చుంది. ఆ అవలోకనంలో ఆమె అనూరాధని గమనించింది. ఆమె ఎవరో, ఈ సాబ్‌కి ఏమవుతుందోనని ఆమె ఆలోచిస్తూ ఉండిపోయింది.

ప్రిన్స్ నిలబడే ఉన్నాడు. వొంతులవారీగా ఒక్కొక్కరి ముఖాన్ని పరిశీలిస్తున్నాడు. ఈ విపరీతపు వర్షంలో అతను శ్రమపడి చేసిన ఏర్పాట్లకి బోనస్ రావలసి ఉంది. ఈమె ఎవరో తెలీదు. తాను ఎక్కువ మాట్లాడేదులా ఉంది. సాబ్ ఆలోచనలో పడ్డాడు. సామాన్య పరిస్థితుల్లో ఆయన ఆచరణేగాని ఆలోచనల్తో కాలం వృధా చేసే మనిషి కాదు. ఇంక నోరు మూసుకుని ఉండడమే మంచిదని అతను నిర్ణయించుకున్నాడు. కూర్చుంటే లాభంలేదు—సాబ్ వేరే ఏర్పాటు చేసుకుని ఉంటే, తానూ త్వరగా వేరే ఏర్పాట్లు చేసుకోవాలి.

అనూరాధకి అంతా బోధపడింది. తాను చాలా పెద్ద ఇరకాటంలో పడింది. ఇందుకేనన్న మాట ఆయన వేరే రూమ్ కోసం ప్రయత్నించాడు. దొరికి ఉంటే తానూ,అతనూ కూడా సుఖపడేవారు.... ఆమెకి బాధగానూ,సిగ్గుగానూ ఉంది.

"నేను వెడతాను" అంది అనూరాధ హఠాత్తుగా ఒక నిర్ణయానికి వొచ్చి.

"నో" అన్నాడు రాజశేఖర్. ఆ గొంతుకలో ఉన్న అధికారానికి లొంగిపోయి-అనూరాధ నిలబడిందల్లా మళ్ళీ కూర్చుంది.

"ఇలారా, ప్రిన్స్" అంటూ తలుపు తీసి రాజశేఖర్ బయటికి నడిచాడు.

పెంపుడు కుక్కలాగ అతని వెనక బయటికి వెళ్ళి తలుపు వేశాడు ప్రిన్స్.

నాలుగు నిమిషాల తరవాత వాళ్ళిద్దరూ లోపలికి వొచ్చారు.

"చలో బేటీ" అన్నాడు ప్రిన్స్. మర బొమ్మలాగ లేచి అతని వెనకాల వెళ్ళింది స్మిత. రాజశేఖర్ వొచ్చి కుర్చీలో కూర్చుని మరో డ్రింక్ తయారు చేసుకున్నాడు.

"అయామ్ సారీ" అంది అనూరాధ.

"నువ్వేదేనికీ బాధపడొద్దు. నిన్ను.... ఇలాటి పరిస్థితిలో పెట్టినందుకు నాకే బాధగా ఉంది...." అన్నాడు రాజశేఖర్.

"మీ సాయంకాలం— మళ్ళీ పాడు చేశాను" అంది అనూరాధ.

గట్టిగా నవ్వేడు రాజశేఖర్.

"అనూ! నీకు బాగా జ్ఞాపకం ఉంది కదా!" అన్నాడు.

"నాకిదేం బాగా లేదు.... మీరు నన్ను వెళ్ళనివ్వండి.." అంది అనూరాధ.

"ఏ మాత్రం కుదిరినా వెళ్ళనిచ్చేవాడినే! కాని, ఈ సమయంలో ఆ మాట మరిచిపో.... భోజనం చేసి పడుకో" అన్నాడు రాజశేఖర్.

"ఆకలి లేదు."

"ఉంటుంది...." అని, రూమ్ సర్వీస్‌నించి బేరర్‌ని పిలిచి డిన్నర్‌కి కావలసినవి ఆర్డర్ చేశాడు.

"అరగంటలో తెస్తారు" అన్నాడు రాజశేఖర్.

"తొందర లేదు" అంది అనూరాధ.

"రోజంతా బాగా తడిశావు.... కొంచెం బ్రాందీ తాగు" అన్నాడు రాజశేఖర్.

"థాంక్స్. కాని, నాకలవాటు లేదు"

"మొట్టమొదట అందరూ అంతే- కానీ, నీ కటువంటి అలవాట్లు ఉంటాయని అనలేదు నేను. మెడిసినల్‌గా. అంతే."

"వొద్దు."

"ఓ. కే...."

రాజశేఖర్ రెండు టెలిఫోన్లు చేశాడు. ఒకటి నిజామ్ క్లబ్‌కీ, మరొకటి సికిందరాబాద్ క్లబ్‌కీ. రెండుచోట్ల ఏమీ గదులు లేవని చెప్పేరు.

అతను సిగరెట్ కాలుస్తూ ఉండిపోయాడు.

"సారీ" అంది అనూరాధ అతని అవసరాన్ని గురించి ఆలోచిస్తూ.

అతను మాట్లాడలేదు. మ్యూజిక్ ఛానల్స్ చూసి హిందీ పాటలు పెట్టాడు. తాగుతూ, సిగరెట్ కాలుస్తూ మధ్య మధ్య అనూరాధని గమనిస్తున్నాడు. అనూ అని పిలిచినా ఆమె ఏమీ అననందుకు అతను కొంత సంతోషపడ్డాడు.

ఈ రాత్రి ఎలాగ గడపడం అని ఆలోచిస్తోంది అనూరాధ.గొయ్యిలో నించి వచ్చి నుయ్యిలో పడినట్టు ఉంది ఆమె పరిస్థితి. ఈ గదిలో అతనితో.... రెండు బెడ్స్ వెక్కిరిస్తో నవ్వుతూన్నట్టు ఎదురుచూస్తున్నాయి. తెల్లటి బెడ్ షీట్స్‌తో. అతను తాగుతున్నాడు. స్త్రీ లోలుడు. తన మూలంగా స్మిత అతనికి దూరం అయిపోయింది. ఈ వర్షపు రాత్రి, ఈ ఖరీదైన గదిలో తేలిగ్గా వాస్తోన్న సంగీత తరంగాల మధ్య.... ఏమవుతుంది? శుభ్రంగా స్నానం చేసి, బట్టలు మార్చుకునే సరికి తనకి ఎంతో సుఖంగా ఆనందంగా ఉంది కాని, తరవాత జరగబోయేదేమిటి? భూషణం జ్ఞాపకం వొచ్చాడు. అమ్మ చూడకుండాఅటు వెళ్ళడం-అతను తనని....

డిన్నర్ వొచ్చింది.

నిశ్శబ్దంగా ముగించారు. క్లీన్ చేసి బాయ్ వెళ్ళిపోయాడు.

అనూరాధకి నిద్ర ముంచుకొస్తోంది. ఉదయం నించీ అలసిపోయిన శరీరమూ, మనసుకూడా విశ్రాంతిని కోరుకుంటు




న్నాయి. పులి గుహలో నిద్రపోవశం లాంటిది ఇక్కడ నిద్రపోడం. కాని, ఒక్కొక్కప్పుడు గత్యంతరంలేనప్పుడు మనిషి ఏమైనా చేస్తాడు. అనూరాధ పరిస్థితి అలాగే వుంది. ఆమె దేనికైనా సంసిద్ధంగా వుంది.

"నిద్ర వొస్తోందా?" అన్నాడు రాజశేఖర్.

"అవును" అంది అనూరాధ అవులింతని ఆపుకోకుండానే.

"నిద్రపో నేను కొంచెంసేపు ఆ పుస్తకం చదువుతాను. లైటు ఉంటే ఫరవాలేదుగదా?" అన్నాడు రాజశేఖర్.

నవ్వు ఆపుకోలేకపోయింది అనూరాధ. ఈ పులి భయంతో తానుంటే, దీపం గురించి అడుగుతాడు!

"నువ్వు నవ్వుతోంటే నాకు బాగుంది అనూ! ఎందుకో చెప్పు. నేనూ నవ్వగలనేమో చూస్తాను" అన్నాడు.

ఉన్నది ఉన్నట్టు చెప్పి.... "ఆ సాయంత్రం.... ఈ రాత్రీ—" అని, ఆగిపోయింది అనూరాధ.

చిన్న నవ్వు నవ్వేడు రాజశేఖర్.

"భయపడకు అనూ!.... నేను శ్రీరామచంద్రుణ్ని కాకపోవచ్చు. కాని, నీకు ఒక్క పూట సాయంచేసి బలవంతం చేసేంత నీచుణ్ని కాదు. హాయిగా నిద్రపో. నేనూ రెండు టాబ్లెట్లు మింగి పడుకుంటాను...." అన్నాడు.

"థాంక్స్!" అంది అనూరాధ. అతని మాటలు మనసారా నమ్మింది. వేరే దారిలేదు.

బెడ్ ఎంతో మెత్తగా వుంది. గదిలో చలిగా వుంది. రగ్ కాళ్ళ మీద నించి లాగి గుండెల దాకా కప్పుకుంది. కాని, కళ్ళు మూసుకున్నా నిద్ర రాలేదు. కళ్ళు బరువుగా వున్నా, మనసూ మరీ బరువుగా వుండడాన్న ఆలోచనల గాలులు నిద్రామేఘాలని చెదరగొట్టేస్తున్నాయి. రాజశేఖర్ ఏదో పుస్తకం చదువుతూ కుర్చీలో కూర్చున్నాడు. అయిదు నిమిషాల తరవాత ఆమెవైపు చూసి "ఏం నిద్ర రాలేదా?" అన్నాడు.

"లేదు. వొస్తుంది" అంది అనూరాధ.

"దానికి కారణం నాకు తెలుసులే"అన్నాడు రాజశేఖర్. బ్రీఫ్ కేస్ లోనించి మాత్రల స్ట్రిప్ తీసి ఆమె దగ్గరకి తెచ్చి చేతికిచ్చి వెనక వున్న రీడింగ్ లాంప్ వేసి. "అవి ఏమిటో తెలుసునా?" అన్నాడు.

ఆమెకి తెలుసు. అవి చాలా బలమైన నిద్రమాత్రలు.

ఆ మాటే చెప్పింది. "కాని.... నాకు అవసరం లేదు," అంది.

అతను నవ్వేడు. "నీకు కాదు.... నాకు. ఒకటికి బదులు రెండు వేసుకున్నానంటే ఈ విస్కీమీద ఒళ్ళుతెలీని నిద్రపట్టేస్తుంది.... ఆ వెంటనే నీకూ పట్టేస్తుంది" అన్నాడు. రెండుమాత్రలు నోటిలో వేసుకుని గ్లాసులో మిగిలిన విస్కీ తాగి, లోపలికి వెళ్ళి పళ్ళుతోముకుని, గది లాక్ చేసి అతనూ రెండో మంచంమీద పడుకున్నాడు. ఆ రెండు మంచాలకీమధ్య ఒక మీటరు దూరం ఉంది.

"నీ భయం నీకూ, నాకూ తెలుసు అనూ!.... నా భయం నీకు తెలీదు...."

"ఏమిటది?" అంది అతను ఆగడం చూసి,

"నీ భయం నిజం అవుతుందని. పది నిమిషాల తరవాత భూకంపం వొచ్చినా తెలివిరాదునాకు. ఉదయం ఎనిమిదికి లేపు- అప్పటికి సరిపోతుంది" అన్నాడు రాజశేఖర్.

అనూరాధ ఏమీ అనలేదు.

"గుడ్‌నైట్ అనూ! మరో రోజున మరోలా జరుగుతుంది. ఇవేళమాత్రం కాదు" అన్నాడు.

"గుడ్‌నైట్" అంది అనూరాధ ఆమె మనస్సంతా చెదిరిపోయింది.

## 3

ఆ మూడోరోజు ఫ్లైయిట్‌లో మద్రాసు తిరిగి వొచ్చింది అనూరాధ. ఎంత ప్రయత్నించినా రైల్లో ఆమెకి టికెట్ దొరకలేదు.

ఆ రాత్రి మాట నిలబెట్టుకుని రాజశేఖర్ నిద్రపోయాడు. ఎనిమిదికి లేపితే, నిద్ర లేవగానే, "బాగా నిద్రపోయావా అనూ? నేనేమీ అల్లరి పెట్టలేదు గదా?" అన్నాడు.

ఆ రోజంతా అతను ఆమెతో రూమ్‌లోనే ఉండి

పోయాడు. ఆమెకోసం ఎక్కడినించో రెండు చీరలు తెప్పించాడు. ఆమె వద్దంటే వినలేదు. "ఈ రోజుకి వాడు- వొద్దంటే రేపు పారెయ్యి...." అన్నాడు. ఆమె బట్టలన్నీ నాలుగ్గంటల్లో ఉతికించి తెప్పించాడు.

పెద్ద వర్షం కాకపోయినా, రోజంతా చిన్న చినుకులు పడుతూనే ఉన్నాయి. రూంలోనే కూర్చున్నారు. ఆ రోజు ఫ్లైయిటు లేదు. "మనమిద్దరమూ ఇక్కడ బందీలం. వీలైనంత సుఖపడదాం" అన్నాడు మధ్యాహ్నం ఆమె కళ్ళలో మెరుపు చూసి. "నా వాగ్దానం నిలబెడతానులే....అదికాదు నా ఉద్దేశం" అన్నాడు.

ఆ సాయంత్రం అతనికి మరో రూమ్ దొరికింది.

"ఈ రాత్రి నువ్వింకా సుఖంగా నిద్రపో.... మరో రూమ్ మూడో ఫ్లోర్‌లో దొరికింది" అన్నాడు రాజశేఖర్.

కొంచెం ఆలోచించింది తన మీద అతను వొందల కొద్దీ ఖర్చుచేస్తున్నాడు. ఒంటరిగా ఉండడంలోనూ భయం

# ఒకటెలా అవుతుంది?

సాగరంలో కనిపించే నీరు
నదిలో ప్రవహించే నీరు
ఒకటెలా అవుతుంది?
రుచి తెలియని కంటికి మాత్రం
ఒకేలా కనబడుతుంది!

వర్షం కురిసిన నీరైనా
కన్నులనుండి కారిన కన్నీరైనా
ఒకటెలా అవుతుంది?
బాధ తెలియని నేత్రాలకి-మాత్రం
అది ఒకటే అని తెలుసు!

గొప్పవాడి నరాల్లో ప్రవహించేది
బీదవాడి నరాల్లో ప్రవహించేది
ఒకే రక్తమెలా అవుతుంది?
మోసపోయిన నేత్రాలకి-మాత్రం
ఒకే రంగు కనిపిస్తుంది!

—'సూర్య'

# ప్రకృతి విలాపం

నిర్మలమైన ఈ తటాకం
మురికి భావాల కలయికలో
దుర్గంధాన్ని కలుపుకుంది
శ్వేతవర్ణం దాల్చి శాంతిదూతగా
నిల్చిన కపోతం
మాంసాహారుల చేతిలో చిక్కింది
పరిమళించబోతున్న మొగ్గ
కర్కోటక కరాల రాపిడివల్ల
కొన ఊపిరిలో నిట్టూర్పులు
విడుస్తూంది
ఆనందాస్వాదనకు వింత రాగాలు
సంతరించుకున్న వీణ
వంచనల ఘోర తాకిడితో
పలుకుతూంది అపస్వరాలు
పాలను, నీటిని వేరుచేయగల్గిన
ఈ కలహంస విషాన్ని కలిపితే
విసర్జించలేకపోయింది
ఆశా జలదం
అనుగ్రహించ మరచినందున
నందనవనం
ఎండమావుల నెలవయ్యింది
మాంసపు ముద్దల పంజరంలోని పక్షి
మన్మథ బాణాలను ఆకర్షిస్తూ
నరకాన్ని కౌగిలిస్తూంది.

—గాలి రోసివాయుడు

ఉంది. ఇతను అన్యాయం చేస్తాడనుకోడానికి ఏమీ ఆధారం లేదు.

"వొద్దులెండి ..." అంది.

"నువ్వు ఫ్రీగా ఉండాలి.... మరేమీ బాధలేదు." అన్నాడు ఆమె మాట వినకుండా. స్మిత జ్ఞాపకం వొచ్చింది ఆమెకి.

"మీరు ఫ్రీగా ఉండాలంటే అలాగే చెయ్యండి.... పూర్ గర్ల్! నావల్లనిన్న నష్టపోయింది" అంది అనూరాధ.

గట్టిగా నవ్వేడు రాజశేఖర్.

"నీ ఆలోచనలు ఏ క్షణంలో, ఎలాగ వెడతాయో తెలుసుకోవడం చాలా కష్టం అనూ! నేను స్మిత కోసం చెయ్యలేదు- నీ కోసమే చేశాను. మరో విషయం చెప్పేదా అసహ్యించుకోకు— ఆమె రేపటిదాకా ఫ్రీకాదు" అన్నాడు.

ఆమె ఆ విషయంమీద మాట్లాడలేదు. "మీ యిష్టం. మీ బాకీ పెరిగిపోతూనే ఉంది" అంది.

అతను రెండో రూమ్ కేన్సిల్ చేశాడు.

ఆ రాత్రి అతను ఎక్కువ తాగలేదు. మాత్రలు వేసుకోబోయాడు. ఆమె వారించింది. "మీ పిన్సిపల్స్ ఉన్నాయి కదా!...." అంది.

మూడో రోజు ఉదయం ఆమెని విమానం ఎక్కించాడు



## చీకటినుండి వేకువకు

కొత్త మొక్క జన్మిస్తోంది విత్తుకడుపు చీల్చుకొని
మెరుపు శిశువు జన్మిస్తోంది మేఘ గర్భం చీల్చుకొని
వికృతి నుండి ఒక వినూత్న సృష్టి;
సుషుప్తి నుండి ఒక జాగ్రద్దృష్టి.

పండుటాకులు రాలితే పసరుటాకుల పుట్టుక
చివుకు బతుకులు ముగిస్తే నవజీవాల పుట్టుక
శిథిల శిశిరాంతానికి వసంత వాయు తరంగం;
నవజీవన గానానికి సంధానిత మరణ మృదంగం.

దధిని మథించినప్పుడే పుడుతోంది నవనీతం
ఎదను మథించినప్పుడే పుడుతోంది నవగీతం
సంక్షోభం నూతన రూపానికి నాంది;
సంఘర్షణ పురా విరూపానికి ప్రతిద్వంది.

సమ్మెట ప్రేటులతోనే సరికొత్త రూపం లోహానికి
ఉలి శిక్ష ననుభవిస్తేనే ఊపిరి శిల్పానికి
వేదనా మురళిపై చైతన్యపు రవళి;
వైప్లవ్య యాగానికై రక్తాశ్రువుల బలి.

—పాపినేని శివశంకర్

రాజశేఖర్. అతనూ వాస్తాడని అనుకున్న అనూరాధకి కొంచెం ఆశాభంగం అయింది. "కంపెనీ పని తగిలింది.రేపు వాస్తాను" అన్నాడు. అది ఏ కంపెనీయో నాకు తెలుసులే అనుకుంది అనూరాధ. ఈ పరిస్థితినించి తప్పించుకున్న ఆనందం ఆమెకి ఏమీ లేదు. ఎందుకో, ఆ స్మితని తల్చుకుంటే ఆమెకి కోపంగా ఉంది. "నేను విమానంలో ఎప్పుడూ పోలేదు—ఒంటరిగా వెళ్ళాలంటే భయంగా ఉంది" అంటే, "నీతో ఇంకో రెండువొందల ఎన్నభైమంది ఉంటారులే" అన్నాడు. ఖర్చు గురించి మాట్లాడితే, "నాకు ఒక సంతృప్తి అయినా మిగలనీ అనూ....దయచేసి డబ్బు గురించి మాట్లాడకు.... అదే నీ నించి నేను ఆశించేది" అన్నాడు. స్మిత జ్ఞాపకం ఆమెని మొదటిసారి విమానంలో ప్రయాణపు ఆనందాన్ని అనుభవించకుండా చేసింది.

ఇంటికి చేరగానే, అమ్మ పురాణం మొదలుపెట్టింది. "వయసొచ్చిన ఆడదానివి—ఒక్కర్తివీ వెళ్ళేవు.... వొచ్చేవు! ఈ నాలుగైదు రోజులు ఎక్కడ తిరిగేవో ఏమో! నీకేం—హాయిగా ఉద్యోగం అని చెప్పి వెడతావు. ఇంట్లో కూర్చుని అందరూ అడిగే ప్రశ్నలకి సమాధానం నేను చెప్పాలి" అంటూ దీర్ఘాలు తీసింది.

సామాన్యంగా అయితే అనూరాధ ఆమెకి ఘాటుగా సమాధానం ఇచ్చి ఉండేది. అక్కడ తాను వొద్దంటున్నా రాజశేఖర్ కొనిచ్చిన రెండు చీరలకీ ఈవిడ అకౌంటు అడిగితే ఎలాటి అబద్ధం చెప్పాలోనని ఆమె ఆలోచించింది. అదీకాక, ఈ అనుభూతిలోని అనేక విషయాలు ఆమెని బాధిస్తున్నాయి. వెనక్కి తిరిగి చూసుకుంటే, తొలినాడు రాత్రి— ఆ వర్షపు రాత్రి తాననుకున్నదేదీ జరగకపోవడం తనకి కేవలం మామూలు ఆశ్చర్యంగానే మిగల్లేదు. ఆ రాత్రి తాను గంభీరంగా మాట్లాడినా, అంతరాంతరాలలో దేనికైనా సిద్ధపడి ఉంది. ఈ వయసులో మగవాళ్ళ సంగతి ఏమీ తెలియని మనిషి కాదు తాను. అందులోనూ ఆ మనిషి రాజశేఖర్—దెబ్బ తిన్న పులిలాటివాడు. కాని.... ఎందుకలాగ ప్రవర్తించాడు? తాను ఆశించని అభిమానం, సహాయం, తనకి అందజేశాడు. తనతో అతను తిరిగి రాకపోవడం తప్ప తనకి అప్రియమైనదేదీ అతను చెయ్యలేదు. చివరకి స్మితని కూడా పంపించేశాడు. ఎందుకని? అతని మనసులో ఏముంది? భయాన్ని చెయ్యలేని పని నయాన్ని చేద్దామన్న పథకంలో ఇది మొదటి భాగమా?

వొచ్చే రోజున అతను కార్డు ఇచ్చేడు- ఇంటి అడ్రసు మారిందిట. "తరవాత నాకు ఉద్యోగం పెద్దదయిందిలే.... ఏం కావలసినా ఫోన్ చెయ్యి" అన్నాడు.

"మీరు చేసిందే చాలు.... తీర్చుకోలేని బాకీ బరువు నా మీద పెట్టారు. చాలు" అంది. ఇదంతా ఎందుకు చేశారని అడిగితే అతను నవ్వి ఊరుకున్నాడు.

మద్రాసు రాగానే మళ్ళీ ఉద్యోగం. అతి కష్టంమీద వాళ్ళిచ్చిన మూడురోజుల సెలవూ నాలుగు రోజులకి పొడిగించడానికి ఎంతో శ్రమపడాల్సివొచ్చింది.

పని ఎక్కువగానే ఉంది. తొమ్మిదినించి అయిదుదాకా

రోజూను. ఎకౌంట్లు రాయడం. టైపు చెయ్యడం. అవసరమైతే ఉత్తరాలూ— ఒకటేమిటి, అన్ని రకాల పనులూను. ఒక్కొక్కప్పుడు ప్రాణం విసిగిపోతుంది. ఇదంతా చేస్తే నెలకి మూడు వొందల రూపాయల జీతం. ఏదో పేరుతో కొంత కోసి రెండు వొందల అరవై చేతికి ఇస్తారు. బస్ ఖర్చులూ, అమ్మ టిఫిన్ ఇవ్వనినాడు టిఫిన్ ఖర్చు నెలకెలాగైనా నలభై పోతుంది. మిగిలిన దానితో ఇల్లు గడపాలి. ఏదో గడుపుకోవచ్చు. కాని ఇంటి దగ్గర అమ్మ నస. వారానికి రెండుసార్లయినా ఆవిడకి తలనొప్పే. నరాలు లాగడం. గుండెలో దడా—అన్నీ వొచ్చేసి సాయంత్రం తనకి కాఫీ ఇచ్చే శక్తికూడా ఉండదు. ఆ రాత్రి తానే వంటచెయ్యాలన్న మాట. "ఆ మహారాజు అన్యాయం చేసి పోయాడు... మందుకైనా లేకుండా ఉంది.... ఎప్పుడో ఇలాగే గుటుక్కుమంటాను" అంటూ ఉంటుంది. అది మామూలు ఉపన్యాసం. ప్రత్యేక పరిస్థితుల్లో వయసులో ఉన్న ఆడవాళ్ళమీద దాడి చేస్తుంది. అనూరాధ పేరెత్తదుగాని ఆ అవసరం లేకుండానే అందరికీ బోధపడుతుంది. "తెచ్చిన బంగారం లాటి సంబంధం అవిడగారికి పనికిరాదు! వాడికేం! మహారాజులా ఉన్నాడు— అందరిలాగా వాడూ ఉద్యోగం చెయ్యాలా ఏం? లక్షణంగా పువ్వుల్లో పెట్టుకుని చూసుకుంటాడు. అయినా రాత ఉండొద్దు?" ఇలాగా సాగుతూ ఉంటుంది. ఆమెమీద ఎంత కోపం ఉన్నా. అనూ అవన్నీ సహిస్తుంది. నాన్న బ్రతికి ఉన్నన్నాళ్ళు తనని ప్రాణంలాగ చూసుకోవడం ఆమె ఎప్పుడూ మరచిపోదు. ఆయన దయవల్లకాకపోతే తన చదువు ఎనిమిదో క్లాసుతోనో, తరవాత పెద్దమనిషి కావడంతోనో ఆగిపోయి ఉండును. ఆ డిగ్రీ ఈ రోజు కొంచెం అయినా అన్నం పెడుతోంటే కూడా ఆ సాధింపు మానదు. "చదువులు! ఎందుకొచ్చినవి! పాతిక వయసు దగ్గరపడుతున్నా. ఓ పెళ్ళి." పేరంటమూ, బిడ్డలూ లేకపోయాక ఎందుకొచ్చిన చదువు?— అంటుంది. ఒకటి రెండుసార్లు తానూ కోపంగా కలుగజేసుకుని, "అది ఉంది కనుకనే ఇంతయినా తింటున్నాం" అంది. కాని, ఆవిడ తర్కం వేరు. చదువు లేకపోతే భూషణం భర్తకాగా, ఈ ఆస్తికి అతను వారసుడై మరో మేడ కట్టించి ఉండేవాడు.

అనూ పెళ్ళిమాట రాలేకపోదు. ఇద్దరు పెళ్ళికొడుకులు వొచ్చారు—నాన్న పినతల్లి కొడుకు చేద్దామనుకున్న ఉపకారం


పిసినారి వేసంగి విసరు చిరు వీచికలె
అలవాటుపై ఏరు అల్ప సంతోషలను
రైలు వంతెన కవల రాగమయమైన
గంభీర గగనమ్ము కదిలించగలదె.


పడమరల తడబడుచు పడిపోవు ప్రొద్దు
మిగిలించు తుదికావి దిగిపోవు మునుపె
పసుపు పన్నీటిలో బాగుగా స్నానమై
పరిశుద్ధ పౌర్ణిమ ప్రాచి తలనెత్తినది.
ఇంతలో వంతెనకు చెంతగల చెట్లలో
తనకున్న ఒక గొంతు తనర ప్రకటించుటకొ
గానమున చందురుని కౌగిలించుటకొ
పీయూష చరణాలు పికము చిలికినది....

చంద్ర కణ్వాశ్రమ ప్రశాంత స్రవంతిలో
జలదపు శకుంతములు జలము త్రావెడు వేళ
దారి ప్రక్కన నారికేళాంగుళులు కదలి
*తంతి త్రోవల సుధా తంత్రి మీటెడు వేళ

పిట్టగోడల గాజు పెంకుల మిలమిలవలె
మురికిపేటలు కూడ మెరిసిపోయినవి
తనువుపై తళతళలు తనువులో తళుకులా—
మురికికాలువ కూడ మురిసి పారినది
*తంతి త్రోవలు = టెలిగ్రాఫ్ తీగలు

—నివర్తి మోహన్‌కుమార్






అది. ఇద్దరూ ఏదో చిన్న చిన్న ఉద్యోగాలు చేసుకుంటూన్న వాళ్ళే కాని, కట్నం విషయంలో వాళ్ళ అభిప్రాయాలు చిన్న చిన్నవిగా లేవు. ఈ ఇల్లు అమ్మేసినా, సగం ఖర్చులు కూడా రావు. ఆ తరువాత ఈ ఆరేడు నెలల్లోనూ మళ్ళీ సంబంధాలు ఏమీ రాలేదు.

అనూరాధ జీవితం చిన్న చిన్న ప్రేమాయణాలు లేకుండానూ సాగలేదు. పెద్ద అందగత్తె కాకపోయినా, కనీసం ఉండాల్సిన లక్షణాలన్నీ ఆమెకి ఉన్నాయి. కాలేజీలో ఒక అబ్బాయి ఉండేవాడు. రామ్‌కుమార్ అతని పేరు.కుమార్ అని పిలిచేవారు. అతను ఒక సంవత్సరం అనూ వెంటబడ్డాడు. చూడ్డానికి బాగుండేవాడు.కలవారి పిల్లవాడు. "నిన్ను ప్రేమిస్తున్నాను రాధా!.... నువ్వు లేకపోతే బ్రతకలేను" అనేవాడు. వారానికొకసారైనా బీచ్‌కి, సినిమాకి పిలుచుకుని వెళ్ళేవాడు. చాలాసార్లు రూమ్‌కి తీసికెళ్ళాడు. చిన్నచిన్న చనువులు తీసుకొనేవాడు. అతనికి కోరికలు తీరేవి కాదు. మనకి హద్దులేమిటి నాన్సెన్స్! చదువుకున్నవాళ్ళం: ప్రేమించుకున్నవాళ్ళం! అంటూ చతుర్విధోపాయాలు ప్రయోగించాడు. ఒకసారి చాలా ప్రమాదకరమైన పరిస్థితుల్లో ఎవరో తలుపుతట్టడం జరిగింది. లేకపోతే ఏమయేదో! తరవాత అతనిలాగే ఆ వీధిలో మరో అమ్మాయితోనూ ప్రణయకాండ సాగించాడు. ఆమె కన్యాత్వం వించి మాతృత్వానికి త్వరత్వరగా ఎదగడంతో గొడవ జరిగింది. అతని తండ్రి అమ్మాయికి పదివేలో, ఏదో ఇచ్చి శాంతపరిచాడని ఆమెకి తెలిసింది. కుమార్ ఆ తరువాత చదువు మానేసి లక్షణంగా లక్షరూపాయల కట్నంతో వొచ్చిన అమ్మాయిని పెళ్ళిచేసుకున్నాడు. ఆ తరువాతా అతను రాధని మరిచిపోలేదు. తరచు ఆమెని పలకరించే ప్రయత్నం చేశాడు. "పెళ్ళికి ప్రేమకి ముడిపెట్టకూడదు. నా బాధ నీకు తెలీదు. నా భార్యలో రొమాన్స్ లేదు రాధా! మనమధ్య ఎంతఆనందం ఉంటుందో ఆలోచించు"అనేవాడు. ఒకసారి మరీన్యూసెన్సుగా ఉంటే. "నీ భార్యకి రొమాన్సు నేర్పించు— గురువులు దొరక్కపోరు" అని చెప్తే అతనికి నచ్చక తనమీద టైమ్ వేస్ట్ చెయ్యడం మానేశాడు.

రెండో అబ్బాయి ఉద్యోగి. ఏదో పనిమీద అనూరాధ పనిచేసే ఆఫీసుకి పనిమీద వచ్చాడు. చిన్న రొమాన్సు మొదలుపెట్టేడు. కాని, అతను చాలా మంచివాడు. పెళ్ళి మాట ఎత్తవొద్దని ముందే చెప్పేడు. దానితో అది త్వరగా ముగిసిన కథ అయింది.

ఈ మాత్రం జ్ఞాపకాలు చేదువే అయినా ఉండడం మంచిదే అయింది ఒంటరిగా కూర్చున్నప్పుడూ, వేరే ఏమీ పని లేనప్పుడూ ఆమెకి ఆలోచనల్లో ఆ వివరాలు కొంత కాలక్షేపం ఇస్తూ ఉండేవి.

హైదరాబాద్‌నించి తిరిగి వచ్చాక రాజశేఖర్ గురించి ఆమె చాలా చాలా ఆలోచించింది. తప్పకుండా మళ్ళీ కలుసుకోమని అతననలేదు. కాని తన కర్తవ్యం ఆమెకి బోధపడలేదు. సామ, దాన ఉపయోగాలు తన మీద అతను ప్రయోగిస్తున్నాడనే ఆలోచన మాత్రం క్రమంగా పటిష్టం అవసాగింది. అతన్ని కలుసుకోకపోవడం కనీసం ప్రస్తుతానికి మంచిదని అనూరాధ నిశ్చయించుకొంది. తన అంతరంగాల లోతుల్లో తెలిసీతెలియని భయం ఒకదాన్ని ఆమె గుర్తించింది. అది తనలోనే దాగిఉండి బయటికి రావడానికి ప్రయత్నిస్తోన్న దౌర్బల్యం. ఆమె భయపడిపోయింది. ఏ పరిస్థితుల్లోనూ అతనికి ఫోన్ చెయ్యకూడదని నిర్ణయించుకుంది.

అలాగ రెండు నెలలు గడిచాక ఒకనాడు ఆఫీసునించి వస్తోంటె సరళ కనిపించింది.అనూరాధ బస్‌కోసం నిలబడింది. సరళఆనాటి సాయంత్రం రాజశేఖర్ ఇంట్లో జరిగిన ఉదంతం తరువాత ఒకటి రెండుసార్లు కనిపించింది మొదట ఉద్రేకంగా తాను చాలా అన్నా, ఆమె జవాబివ్వలేదు. తన నిందలన్నీ విని, "సారీ! అలాగ అవుతుందని నేననుకోలేదు" అని మాత్రం అంది ఆ తరువాత సంవత్సరందాకా కలియలేదు. ఆటో ఆపి, "కమాన్" అంది.

"ఎక్కడికి?" అని అడిగింది అనూరాధ.

"నీకేం ప్రమాదం లేని చోటికేలే" అంది సరళ.

సరళని క్షమించి ఉంది కనుక అనూ వెంటనే ఆటోలో కూర్చుంది మౌంట్‌రోడ్‌లో ఒక షాపుకి వెళ్ళి రెండు

వందల చిల్లర రూపాయిలకి ఒక చిన్న దంతపుబొమ్మ కొంది సరళ. రాధాకృష్ణుల జంట ఆ బొమ్మ. చాలా బాగుంది అని అనూరాధ అన్నాకనే సరళ తీసుకుంది.

బయటికి వొచ్చాక, "పద- కాఫీ తాగి నిన్నింటి దగ్గర వదులుతాను" అంది సరళ. వుడ్‌లాండ్స్‌కి పోయి టిఫినూ కాఫీ తీసుకుంటూంటె "ఏమిటి కథ? బహుమతి ఏదో కొన్నావు?" అంది అనూరాధ.

"అవును. ఒక ఫ్రెండ్ బర్త్‌డే ఇవాళ."

అప్పుడు గమనించింది అనూరాధ సరళ చాలా చక్కగా ముస్తాబై వచ్చిందని.

"అలాగా!.... మంచి గిఫ్ట్ కొన్నావు" అంది అనూరాధ.

"ఆ మాట నువ్వంటే ఏమిటి లాభం? అతననాలిగా!" అంది సరళ.

"ప్రేమలో పడ్డావా?" అంది అనూరాధ నవ్వుతూ.

"నేనెప్పుడూ ప్రేమలోనే ఉంటాను రాధా!.... ప్రేమలోనూ రకరకాలు. నాదో రకం!" అంది నిట్టూరుస్తూ సరళ.

కాఫీ టిఫిన్ ముగించుకుని బయటికి వొచ్చారు. ఆటో కోసం చూసి చివరికి ఒకటిదొరగ్గానే అనూరాధని ఎక్కమంది.

"నేను బస్‌లో వెడతాన్లే- నువ్వు వెళ్ళు.... నీకు ఆలస్యం అవుతుంది" అంది అనూరాధ.

"నేను ఎనిమిది దాకా వెళ్ళకపోయినా ఫరవాలేదు— పద."అంటూ చెయ్యి పట్టుకుని స్నేహితురాల్ని ఎక్కించింది. "చాలా కాలం నుంచి నీతో మాట్లాడాలని అనుకున్నాను. ఇవేళ దొరికావు. పద- నీ ఇంటి కొస్తాను" అంది సరళ. ఆటో బయలుదేరగానే.

"ఏమిటి మాట్లాడాలి?" అంది అనూరాధ.

ఆటో శబ్దంలో ఆమె మాట వినిపించలేదు.

పది నిమిషాలలో అనూరాధ ఇంటికి చేరేరు. శిధిలావస్థకి ఎంతో దూరం లేని పాత ఇల్లు అది. కిందని మూడు గదులూ, మీదన ఒకటీ ఉన్నాయి. చాలా కాలం నుంచి సున్నాలు కూడా కొట్టలేదు ఇంటికి. సరళ అక్కడికి వొచ్చి రెండు సంవత్సరాలు దాటలేదు. కాని, ఈ కాలంలో కూడా ఆ ఇల్లు మరి కొంచెం పాడయింది.

తన గదిలోకి తీసికెళ్ళింది సరళని అనూరాధ. అమ్మ అటువేపు వంట ఇంట్లో వుంది.

"కాఫీ తెస్తాను— కూర్చో" అంది అనూరాధ. బల్ల, కుర్చీలు రెండూ, చిన్న టేబిలూ ఉన్నాయి గదిలో. వాటిని కొనేవారులేక వుండిపోయాయి. లేకపోతే అమ్మ వాటికీ బేరం పెట్టి ఉండును. స్టీలు బీరువా, గోడ గడియారం- అలాంటివి నిత్యకృత్యాలకని ఆ మధ్యనే అమ్మేసింది. ఎవరికో ఎంతకో చెప్పడం ఆమెకి అలవాటు లేదు. "ఈ నెల పాలు, గేసూ నువ్వియ్యి. మిగిలిన వాటికి సరిపోతుందిలే" అంది- ఖరీదెంత వొచ్చింది అని అడిగితే.

"వొద్దు— అక్కడ తాగేంకదా!" అంది సరళ. పొరుగింటికి వెళ్ళాలని చెప్పి ఆ క్షణంలోనే అమ్మ బయలుదేరింది. కాఫీ, టిఫినూ చెయ్యాలంటే ఆవిడకి బద్ధకం.


ముఖం కడుక్కుని వొచ్చి కూర్చుని, "చెప్పు- ఏదో ఉందన్నావు కదా!" అంది అనూరాధ.


క్షణం ఆగి, "రెండేళ్ళ కిందట జరిగింది నీకు బాగా జ్ఞాపకం ఉంటుంది నేను మరచిపోలేదు" అంది సరళ.

గుండెల్లోకి రక్తం ఒక్కసారి వొచ్చింది అనూరాధకి. రాజశేఖర్‌ని పూర్తిగా మరచిపోడానికి ఆమె చాలా ప్రయత్నం చేసింది. సరళకీ, అతనికీ ఉన్న సంబంధం ఏమిటో ఆమెకి సరిగ్గా తెలీదు.

తల ఊపింది అనూరాధ.

"ఆ తరవాత నీకు నా మీద చాలా కోపం వొచ్చింది. న్యాయమే. నేను నిన్ను తప్పుగా అంచనా వేశాను. కుమార్‌తో






నువ్వు తిరగడం నాకూ తెలుసు. ఆ తరువాత నీకు ఫ్రెండ్స్ తిరిదేవారు. నీ జీవితం బాగుపడాలని అనుకున్నాను-రాజశేఖర్ సంగతి నాకు తెలుసు. అందుకే నిన్ను పంపేను."

అనూరాధ మాట్లాడలేదు.

"తిట్టాలని ఉంటే తిట్టు. నేను పొరపాటు చేశాను. అతనూ నన్ను తిట్టేడు. నెల కిందటిదాకా నీ మాట ఎత్త లేదు."

"ఇప్పుడేమయింది?" అని అడిగింది అనూరాధ.

"అతను నిన్ను మరిచిపోలేదు. నువ్వెలాగ ఉన్నావని అడిగాడు."

"అలాగా!" అంది అనూరాధ.

"మరో ఉద్దేశంతో కాదు రాధా! జరిగిన దానికి అతను బాధపడుతున్నాడు. ఎంత చెడ్డవాడైనా అతను కొన్ని సూత్రా లకి కట్టుబడి ఉంటాడు. నీకు పొరపాటున బాధ కలిగించాడు. అందుకే బాధ....నిన్నొకసారి చూసి రమ్మన్నాడు. అందుకే వొచ్చాను."

"బాగున్నానని చెప్పు." అంది అనూరాధ. హైదరా బాద్‌లో జరిగినదీ, జరగనిదీ గురించి అతనెవరికీ చెప్ప లేదన్న మాట. ఒక చిన్న భయం తీరింది

"నువ్వు-క్షమించేవని చెప్పనా? —ఈ మధ్య ఎందుకో చాలా మూడీగా ఉన్నాడు. రెండుసార్లు నీ మాట చెప్పేడు. ఇవేళ అతనిదే బర్త్‌డే. అక్కడికే వెడుతున్నాను."

"నీ ఇష్టం.... ఆ రోజు జరిగినది నేను మరిచి పోయాను. అతన్నీ మరచిపోనీ" అంది అనూరాధ. సరళ త్వరగా వెళ్ళిపోతే బాగుండు ననిపించింది. రాజశేఖర్ తనని జ్ఞాపకం పెట్టుకోవడం, అయినా తన జోలికి రాకుండా ఉండటం ఆమెకి చాలా సంతృప్తి కలిగించాయి. అతని నలుపు వెనకాల తెలుపు ఉందన్న మాట, మరోసారి రుజువు అయింది.

"గుడ్— అన్నిటికన్నా మంచి గిఫ్ట్‌గా ఉంటుంది. నీ క్షమ," అని, వెళ్ళడానికి లేచి నిలబడి ఏదో చెప్పబోయింది సరళ.

"ఏమిటి?" అంది అనూరాధ.

"ఒకసారి.... అతన్ని కలుసుకోకూడదూ?—నీకు నచ్చ నిది ఏమీ జరగదు .నా పూచీ "

"ఎందుకు?" అంది అనూరాధ.

"అతని ఆరోగ్యం బాగాలేదు. ఈ మధ్య మరీ పాడ యింది డాక్టరు దగ్గరకి వెళ్ళాడు.... నిన్నుచూస్తే...."

తేలిగ్గా నవ్వింది అనూరాధ.

"చూద్దాంలే" అంది. సరళ వెళ్ళిపోయింది. ఆమెతో కొంచెం దూరం వెళ్ళి ఆటో దొరకగానే వెనక్కి వొచ్చింది అనూరాధ.అనేక ఆలోచనలతో మంచం మీద వాలింది, తనని రమ్మని సరళ అని ఉంటే బాగుండును అనిపించింది. ఎంత చరిత్ర జరిగి ఉన్నా, తనకితానై అతని దగ్గరికి వెళ్ళడానికి ఆమెకి మనసు ఒప్పలేదు....కాని, త్వరలో అతన్ని చూడా లని అనిపించింది.

## 4

మరోనెల అలాగే గడిచిపోయింది.

అనూరాధ జీవితం అలాగే సాగిపోతోంది. ఏ రోజు కారోజు- ఒక చిన్న చరిత్రలో చిన్న అధ్యాయం— దానిలో చిరునవ్వుల కన్నా నిట్టూర్పులకే ఎక్కువ అవకాశం. ఈ మధ్య అమ్మ ఒక కొత్త ఉద్దేశం బయటపెట్టింది. భూషణం 'లక్షణంగా' పెద్దయింటి పిల్లని చేసుకుంటున్నాడుట. తనని వొచ్చేసి తమతో ఉండమంటున్నాడుట. "నా కిక్కడ ఏమీ లేదు కదా! అక్కడే ఉంటే వాళ్ళని కళ్ళఎదుట చూసుకో వొచ్చు.... పిల్లా పాపా ముచ్చటలు జరుగుతూ ఉంటాయి. అక్కడికే పోయి పడి ఉంటాను" అంటోంది.

"చూద్దాంలే- ఇప్పుడు నీకేమిటి తక్కువ?" అంది అనూరాధ.

"తక్కువ కాకపోతే ఎక్కువ ఉందా? నువ్వేమో ఉద్యోగస్తురాలివి! నువ్వెక్కడ తిరిగి ఏం చేస్తావో నీ ఇష్టం. నా పిల్లవైతే నేను అడగ్గలను, నా పేర ఆయన పెట్టిన వన్నీ హరించుకుపోయాయి. వాడు వ్యాపారం పెట్టేడు- అక్కా! అంతా నీ చేతి చలవే అంటాడు. ముహూర్తం కాగానే వెళ్తా నమ్మా. నీ ఇష్టం ఆ పైన" అంది అమ్మ.

ఆమె ఉన్నప్పుడూ తాను ఒంటరి-లేకపోతేనూ ఒంటరి. అంతగా ఆమె వెళ్ళిపోతే ఇల్లు అద్దెకిచ్చేసి ఏ హాస్టల్లోనో ఉండొచ్చులే అనుకుంది అనూరాధ. ఆ 'ముహూర్తం' ఇంకా నిశ్చయం కాలేదు. బహుశా ఇంకా కొంతకాలం పడుతుంది.

ఆ పరిస్థితుల్లో ఒకనాడు ఆఫీసులో కలిశాడు చంద్ర

మోహన్. ఏవో బిల్స్ గురించి అతని కంపెనీవాళ్ళు పంపేరు. మేనేజరు ఆ పని తనకి ఒప్పజెప్పేడు. రెండు సంవత్సరాల నుంచి తికమకలన్నీ చేసిన గుమాస్తా ఈ మధ్యన ఉద్యోగం వొదిలి వెళ్ళిపోయాడు. సుమారు పాతికవేల రూపాయలకి క్లెయిమ్ పెట్టడం, ఆ పని అనూరాధ మీద పడడం జరిగింది. ఒకటి రెండు నెలలు ఆ పని సాగేలాగ వుంది. ప్రతీ బిల్లు తియ్యడం, దాన్ని వోచర్స్‌తోనూ, ప్రైస్ లిస్టుతోనూ, ఇన్వాయిస్‌తోనూ సరిపోల్చడం, ఎక్కువ తక్కువలు నిర్ణయించడం ఆమె పని. ఆరు వొందల బిల్స్ ఉన్నాయి.

వాళ్ళిద్దరినీ పరిచయం చేసి అనూరాధ పనులన్నీ మరొకరికిచ్చి ఆమెకి పని ఒప్పగించేడు మేనేజరు. బిల్స్ వెతకాలి. వాటికి సంబంధించిన కాగితాలన్నీ తియ్యాలి. ప్రతీ అయిటమ్‌కీ లెక్కలు వేసి కాగితాలు తయారుచెయ్యాలి. చంద్రమోహన్, అనూరాధ అంగీకరించాక, ఆ అయిటమ్ పూర్తి అవుతుంది.

మొదటి రోజు నాలుగుబిల్సు మాత్రం పూర్తి అయాయి. అప్పటికి సుమారు ఆరుగంటలై పోయింది. ఆలస్యం అయిందని చంద్రమోహన్ ఆమెని ఆటోలో దిగబెడతానన్నాడు. ఆమె ఒప్పుకోలేదు. బస్‌లో వెళ్ళిపోయింది.

వ్యాపార విషయాలు బాగా తెలిసినవాడిలాగ కనిపించాడు చంద్రమోహన్. ఆమెకి తెలియనివి చెప్పి, క్లెయిమ్ లేదని కూడా అతను కొన్ని చోట్ల తానే చూపడంతో ఆమెకి అతని మీద గౌరవం ఎక్కువ అయింది.

"నన్ను చంద్రం అని పిలవండి. నా స్నేహితులందరూ అలాగే పిలుస్తారు" అన్నాడు.

"మీరు అలాగే నన్ను రాధా అని పిలవండి" అని చెప్పుకొనేదాకా మాత్రం వొచ్చింది వారం రోజుల పరిచయం. మరో వారం తరవాత అతనితో వెళ్ళి కాఫీ తాగింది హోటల్లో.

అతను హద్దులు మీరే మనిషిగా కనిపించలేదు. అందుకనే ఆ తరవాత ఆదివారం అతనితో సినిమాకి వెళ్ళి బీచ్‌కి వెళ్ళింది. ఆమెకి సముద్రం అంటే చాలా సరదా. కాని ఒంటరిగా వెళ్ళడం క్షేమం కాదు, బాగానూ ఉండదు. ఇలాగే ఎవరితోనైనా వెళ్ళాలి.

అక్కడి ఆహ్లాదకరమైన వాతావరణంలో వాళ్ళు చాలా కబుర్లు చెప్పుకున్నారు. తనకే ఆశ్చర్యంవేసేలాగ రాధ తన జీవితాన్ని గురించి అన్నీ చెప్పింది. అంతా చాలా సింపతీతో విన్నాడు చంద్రం.

"నాకన్నా మీరు అదృష్టవంతులు...." అన్నాడు అంతా విని, అతను.

"నిజంగా?—కాని మిమ్మల్ని చూస్తే అలాగ ఉండరు" అంది రాధ. అతనెప్పుడూ చిరునవ్వుతోనే ఉంటాడు.

"సంవత్సరం కిందట—మూడు నెలలు తప్పనిసరి విశ్రాంతి దొరికింది. ఆ మూడునెలల ఒంటరితనంలో నేనంతా ఆలోచించుకున్నాను.... ఏమి జరిగినా సరే—చిరునవ్వు మాత్రం పోకూడదనీ, ధైర్యంగా నిలబడాలనీ నేర్చుకున్నాను."

అర్థం కానట్టు చూసింది రాధ.

"ఆ తప్పనిసరి ఒంటరితనం ఏమిటి?" అంది.




చిరునవ్వుతోనే. "దాన్ని జెయిలు అంటారు-మూడు నెలలు వేశారు."

"ఎందుకని? మీకు జెయిలు వేశారా?" అంది నమ్మలేని రాధ.

"అవును. అప్పుడు నా అవతారంవేరు. మంచి ఉద్యోగం ఉండేది. చేతిలో పుష్కలంగా డబ్బు ఉండేది. ఆఫీసులో ఎకౌంట్లు ఎలాగ తారుమారు చెయ్యాలో నేర్చుకున్నాను. ఒంట్లో కొవ్వు ఎక్కువ అయింది. చిన్న అభిప్రాయభేదం వొచ్చి ఒకణ్ణి చావగొట్టాను-నాలుగు ఫ్రాక్చర్స్."

"అంత కోపం ఎందుకొచ్చింది మీకు?" అంది రాధ.

"కోపం నాది కాదు. తాగుడు ఎక్కువైంది. ఆ రోజుల్లో తెగ తాగేవాడిని. సిగరెట్లు లెక్కలేకుండా కాల్చేవాణ్ణి. అమ్మా' నాన్నా, నా సిస్టరూ- అందరూ ఏడిచేవారు కాని.... ఆ రోజులు వేరు" అన్నాడు.

"కేసయిందా?"

"అయింది- ఒక చాలా పెద్దమనిషి సాక్ష్యం ఇచ్చాడు- తరవాత అతనే నాకు గురువయాడు. వెయ్యి రూపాయలు ఫైన్ కట్టేను. మూడు నెల్లు జెయిలు.... అంతా వింటే నామీద అసహ్యం పుడుతోందా?" అన్నాడు హఠాత్తుగా.

"లేదు అంది రాధ, కొంచెం సందేహంగానే.

"ఈ విషయం నేను రహస్యంగా దాచలేదు- మా గురువుగారు అలాగా చెయ్యొద్దని చెప్పేరు! ... ఆ మూడు నెలల్లోనూ నేను సిగరెట్ కూడా కాల్చలేదు....బయటికి రాగానే నా చేత పెద్ద ప్రమాణం చేయించారు— మళ్ళీ ఆ రెండు వ్యసనాలకి దరిదాపుల్లోకి పోనని...."

"అదంతా మంచికే వొచ్చిందన్న మాట" అంది రాధ.

"ఏమో! ఆ ఉద్యోగం పోయింది. చిన్న ఉద్యోగం మా గురువుగారే ఇప్పించారు.... చీకటిపడింది పోదామా?" అన్నాడు.

లేచి ఇసకలో నడుస్తూ, "ఎవరా గురువుగారు?" అంది రాధ.

"నేను చెప్పలేను- ఆయన గురువులాటి మాటలు ఉపయోగించడానికి ఒప్పుకోరు.... నేను జెయిల్లో ఉండగా నన్ను ప్రతీవారం చూసిన మనిషి ఆయన ఒక్కడే. కాని. అది

ఎందుకో రహస్యం. అది ఆయన కోరిక. తాను చేసిన మంచి ఏదీ లేదంటాడు. నాకు వ్యతిరేకంగా సాక్ష్యం ఇవ్వవలసి రావడం తన దురదృష్టం అంటాడు.... సారీ!"

బస్‌కోసం చాలాసేపు చూశాక అతని స్కూటర్ మీద వెళ్ళడానికి అంగీకరించింది అనూరాధ. ఇంటి దగ్గర ఆమెని వొదిలి అతను వెళ్ళిపోగానే, "అతనెవడే? కొత్తవాడిలాగ ఉన్నాడు?" అంది అమ్మ.

ఆమె మాటల్లో చాలా ధ్వనులు ఉన్నాయి.

అనూరాధ జవాబివ్వలేదు. చంద్రానికీ, తనకీ మధ్య పెరుగుతోన్న పరిచయం, అతని కథ వినడంతో కొంత నిరుత్సాహకరమైన పరిస్థితి ఏర్పరచింది.... అతను జెయిలుకి వెళ్ళి వొచ్చి ఒక ఉద్యోగాన్ని పోగొట్టుకున్న మనిషి. అదంతా అతను తనకి చెప్పడంలో ఉన్న ఆంతర్యాన్ని ఆమె గ్రహించకపోలేదు. అతనికి ఆమె పట్ల ఉన్న ఆకర్షణ ఆమె కొంచెం రోజుల క్రిందటే గమనించింది. అతనితో ప్రేమలో పడటం లాటిదేమీ జరగలేదుగాని, క్రమంగా ఇద్దరూ చాలా దగ్గరకి వస్తారని ఆమెలో ఎక్కడో ఆశ చిగురించింది. తనకి భర్త కావాలి. అతనికి భార్య కావాలి. తన కులం అతను అడగలేదు. అతనివి ఏమైనా తనకి అభ్యంతరం లేదు. కాని, అతని మంచితనంమీద తనకి ఉన్న నమ్మకవి అతని కథనం ఎక్కువా చేసింది, తక్కువా చేసింది. ఒక సారి ఆ రకం జీవితానికీ, ఉద్రేకానికీ అలవాటుపడ్డ మనిషి శాశ్వతంగా మారిపోతాడనీ ఆమె నమ్మలేకపోయింది. మరో కథ. మొదటి పేరాలోనే అంతం అయింది అని అనుకుని ఒక నిట్టూర్పుతో సరిపెట్టుకుంది.

ఆ తరువాత అతన్ని వీలైనంత దూరంగా ఉంచింది. ఒకటి రెండుసార్లు అతను సినిమాకీ, బీచ్‌కీ వెళదామని సూచన చేశాడు. ఆమె సున్నితంగా చిన్న అబద్ధాలు చెప్పి తప్పించుకుంది. అలాగే చివరికి పని అంతా అయిపోయాక అతను సెలవు తీసుకుంటూ, "నాదొక చివరి కోరిక...." అన్నాడు.

ఆమె చేసిన సెటిల్‌మెంటుకి కంపెనీవాళ్ళు చాలా సంతోషించారు. ఇంక్రిమెంటు ఇచ్చే ఆలోచన కూడా ఉన్నట్టు చెప్పేటంత ఆనందపడ్డారు. దానికి తన తెలివితేటలకన్నా చంద్రం చూపిన సహనం, అతని ప్రవర్తనా ఎక్కువ కారణం అని తెలిసిన అనూరాధ కృతజ్ఞతతో నిండిపోయింది.

"ఏమిటి?" అంది.

"ఈ సాయంత్రం ఒకగంట నాతో బీచ్‌లో గడపండి" అన్నాడు.

కొంచెం ఆలోచించి, "అలాగే" అంది.

"థాంక్స్....సాయంత్రం వొచ్చి ఇంటి దగ్గర పికప్ చేస్తాను" అన్నాడతను.

"వొద్దు—వొద్దు. నేను తిన్నగా ఆవేళ కూర్చున్నచోటికి వొస్తాను" అంది మరీ తొందరగా అనూరాధ. ఆమెకి అమ్మ విషయం ఎక్కువ కలత కలిగించింది. కాని, చంద్రం క్షణికంగా బాధపడడం అతను ఆ తొందరని గమనించిన విషయం ఆమెకి తెలియజేసింది. అతని చిరునవ్వు మాత్రం అలాగే ఉంది.

"మరేమీ లేదు—మా అమ్మ కొంచెం విచిత్రం మనిషి అని చెప్పేనుగా! అనవసరమైన అర్థాలు తియ్యడం ఆమెకి అలవాటు— దయచేసి మరేమీ అనుకోకండి" అంది అనూరాధ.

"అవును—మీరు చెప్పిందీ నిజమే. రైట్.... సాయంత్రం కలుసుకుందాము" అని, చంద్రం వెళ్ళిపోయాడు. తన పనిలో నిగమ్నమవుదామని ఆమె ప్రయత్నించినా, పని ఎక్కువలేకా, చంద్రం విషయంలో వొస్తున్న ఆలోచనలూ, ఆమెకి విశ్రాంతి లేకుండా చేశాయి. అతను దగ్గర ఉన్నంతసేపు అతనిలో ఏదో ఆకర్షణ ఆమెను పెనవేసుకుంటుంది. కాని, అతను దూరంగా ఉన్నప్పుడు అతని చరిత్ర అతనంటే భయపడేలాగ చేస్తుంది.

ఏమయితేనేం, అతనితో పని ముగిసింది. రోజూ చంద్రంతో కూర్చుని వ్యాపార విషయాలు, మధ్యమధ్య ఇతర విషయాలు చర్చించే అవసరం లేదు. ఈ నాటి సమావేశం చివరిది. కనుక అతను తనకొక సమస్యగా ఉండడు. తనని పెళ్ళి చేసుకునే మాట కేవలం ఒక ఆలోచన మాత్రమే. అదీ, తాత్కాలికంగా తన మనసులో ఒక మెరుపు మెరిసి మాయం అయిపోయింది.

అలా అనుకుంది.

ఆ సాయంత్రం ఇంటికి వెళ్ళి అక్కడ నించి బీచ్‌కి వెళ్ళింది. అమ్మ ఏదో సణుగుతూనే ఉంది. అనూరాధ పట్టించుకోలేదు.


ఆమె బస్ దిగే సరికి చంద్రం స్కూటరుమీద కూర్చుని తననీ ఎక్కించుకున్నాడు "ఇక్కడ మరీ జనం ఎక్కువ ఉన్నారు....ఇలియట్స్ బీచ్‌కి పోదామా?" అన్నాడు.

"మీ ఇష్టం" అంది అనూరాధ.

ఇరవై నిమిషాలలో అక్కడికి చేరేరు. కొంచెమైనా ఏకాంతం దొరికింది.

ఇద్దరు ఎదురెదురుగా కూర్చున్నారు.

కొంచెం నిశ్శబ్దం తరవాత, "ఎందుకు ప్రత్యేకంగా పిలిచారు?" అంది అనూరాధ. అతను మామూలుగా లేదు.





నిర్వచించలేని ఏదో ఖేదం ఆ ముఖంలో.

"నిన్నటిదాకా రోజూ మీతో గడిపాను గదా! స్నేహం లాంటిది మన మధ్య వొచ్చింది. ఒక్కసారి అది అంతమై పోవాలని అనిపించలేదు" అన్నాడు చంద్రం.

"థాంక్స్....మీ సహకారంవల్ల మా వాళ్ళు నన్ను మెచ్చుకున్నారు. మీ ధర్మమా అని వాళ్ళకి పదివేలు మిగిలింది కాని, అది నా గొప్పతనమేనని వాళ్ళు అనుకుంటున్నారు" అంది అనూరాధ సిన్సియర్‌గా.

"వాళ్ళు పొరపాటు చెయ్యలేదు" అన్నాడు చంద్రం.

అనూరాధ చిరునవ్వుతో తల ఊపింది.

కొంచెంసేపు ఆ చల్లటి గాలినీ, కెరటాల అందాలనీ ఆస్వాదించి, "మీరు చాలా మంచివారు; స్నేహితులు చాలా కాలం మిమ్మల్ని కృతజ్ఞతతో జ్ఞాపకం ఉంచుకుంటాను"అంది అనూరాధ.

"ఆ విషయమే మాట్లాడాలని పిలిచాను" అన్నాడు చంద్రం.

"ఏమని?"

"ఆ స్నేహం మాట.... మీలో మరిచిపోలేని లక్షణాలు కొన్నిఉన్నాయి. వాటినీ, మిమ్మల్నీ మరిచిపోయేరోజు రాకూడదని నా కోరిక."

"థాంక్స్!.... ఎప్పుడేనా కలుసుకుంటూనే ఉందాము— మీ కంపెనీ పనులకోసమైనా మీరు రావచ్చుకదా!"

"అలాగని కాదు నా ఉద్దేశం."

"ఇలాగ కలవాలనా?"

"కొంతవరకూను. కాని...."

"ఆగిపోయారేం? చెప్పండి."

"మీరు అర్థం చేసుకోండి. మిమ్మల్ని పెళ్ళి చేసుకోవాలని ఉంది. మీతో జీవితమంతా గడపాలని ఉంది."

ఆశ్చర్యంగా చూసింది అనూరాధ.

చాలాసేపు ఆమె మాట్లాడలేదు. చివరికి, "కొంచెం ఆలోచించుకోనివ్వండి ..." అంది.

"తప్పకుండాను!— నిజానికి నేను మా వాళ్ళతో చెప్పాను. వాళ్ళ అభ్యంతరం ఏమీలేదు. ఈ మధ్య నేను గుడ్‌బాయ్ అయిపోయాక నేను తప్పు చెయ్యనని వాళ్ళ నమ్మిక. మీరు ఆలోచించి చెప్పండి."

అనూరాధ తల ఊపింది. ఆమెలో అనేక ఆలోచనలు చెలరేగుతున్నాయి. ఇతన్ని పెళ్ళి చేసుకుంటే తన సమస్యలు చాలా వరకు తీరినట్టే.... కాని ఏ రోజున చంద్రం పూర్వం లాగ అవుతాడో ఎవరికి తెలుసు? అదీకాక, తన చరిత్ర ఏమీ అతనికి తెలీదు. కుమార్ గురించి తాను అతనికి చెప్పలేదు. అది తెలిస్తే ఇతను తనమాట నమ్ముతాడా! రాజశేఖర్‌తో జరిగిన ఉదంతాలు వింటే, అందులో తప్పు ఏమీ లేదని అనుకుంటాడా?

ఇద్దరూ నిశ్శబ్దంగా కూర్చున్నారు.

రాజశేఖర్ బలంగా మనస్సులోకి వొచ్చాడు. అతన్ని ఒకసారి చూడాలి— హైదరాబాదులో అతను తనని ఎలాగ మన్నించాడో తానెప్పుడూ మరిచిపోలేదు. సరళ మాటలు వినగానే వెళ్ళాలనిపించినా, ఏదో అభిజాత్యం తనకు తానై వెళ్ళడానికి అడ్డు వొచ్చింది. కాని, తాను పొరపాటు పడింది.... తప్పకుండా వెళ్ళాలి అనే నిశ్చయానికి ఆ నిమిషాలలో వొచ్చింది.

ఆ మాటా, ఈ మాటా తప్ప ముఖ్యమైన వేమీ వారి మధ్యకి రాలేదు. చీకటి పడగానే ఇంటికి బయలుదేరారు. ఆమెని వీధిమొదట వొదిలాడు చంద్రం. ఆమె ఆలోచనలు రాజశేఖర్‌మీద ఊగడాన్ని అనూరాధ అభ్యంతరం చెప్పలేదు.

## 5

ఆ రాత్రి అనూరాధకి నిద్రపట్టలేదు.

చంద్రం, రాజశేఖర్— వీళ్ళని గురించి తీవ్రంగా ఆలోచించింది.

లోలోపలి మాటలన్నీ బయటికి వొచ్చాయి. సముద్ర

తరంగాలుగా అవి ఆమెని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.

రాజశేఖర్‌లో ఉన్న ఆకర్షణ స్త్రీకి తెలుస్తుంది. అనూరాధకి అర్థమయేసరికి ఆలస్యం అయింది. తాను కాదన్నాక గమనించిన అతని ప్రవర్తన ఆతనిమీది ఆకర్షణని ఆరాధనగా చేసింది. ఆ విషయం లోలోపలే ఉండిపోయి అనూరాధకి విచిత్రమైన అశాంతిని కలుగజేసింది. స్మితమీద ఈర్ష్య ఆమె అందంకోసం కాదు.... అతని కోసం.

ఆ మాట అంగీకరించాక చంద్రంమీది భావన రూపమే మారిపోయింది. చంద్రంలోని ఆకర్షణ చాలా తక్కువ. అది స్త్రీకి కాదు; మనిషికి. ఎవరైనా ఆ ఆకర్షణకి లోబడవొచ్చును. కాని అది నీరసమైనది.

'నాకేమీ వొద్దు. రేపు వెళ్ళి రాజశేఖర్‌ని కలుసుకోవాలి. ఏమైనా సరే' అనుకుంది. అతన్ని వొదిలేసి వేరుగా అన్న భార్యని గురించి సరళ ఎప్పుడో చెప్పినమాట జ్ఞాపకం వొచ్చింది. కాని. ఆమె ధాన్ని గురించి ఆలోచించ దలచుకోలేదు.

ఆ రాత్రికి రాత్రే అతన్ని చూడాలనిపించింది. మూత తియ్యగానే ఉడికే నీటి మీది ఆవిరిలాగ ఆమె కోరిక బలవత్తరం అయిపోయింది. దగ్గరగా టెలిఫోన్ ఉంటే, వెంటనే మాట్లాడి వుండేదే. కాని అది వీలులేకపోయింది. ఆ రాత్రి రెండు గంటలదాకా ఆమెకి నిద్ర రాలేదు. ఆరు కాకుండా లేచింది. కాఫీ పెట్టుకుని తాగింది. ఇల్లంతా సర్దింది. రోజూ తొమ్మిది అయిపోయిందే అని తొందరపడే అనూరాధకి ఆ రోజు కాలం గడవలేదు.

ఆఫీసుకి వెళ్ళగానే రాజశేఖర్‌కి టెలిఫోన్ చేసింది.

ఎవరూ ఎత్తలేదు.

ఆ తరవాత ప్రతీ అరగంటకీ ఒక సారి అతని నంబరు డయల్ చేసింది. పన్నెండు దాటాక ఎవరో ఫోన్ ఎత్తి."ఆయన నాలుగు రోజులనించి ఆఫీసుకి రావడంలేదు" అని ముక్తసరిగా చెప్పిడిస్కనెక్ట్ చేశారు.

ఆమె మనస్సు పరిపరి విధాలుగా పని చేసింది. రాజశేఖర్ ఊళ్ళో లేకపోతే అలాగ చెప్పేవారే. అందుచేత ఊరిలోనే ఉన్నాడు. ఆరోగ్యం బాగా లేదేమో! ఆ మధ్య సరళ అలాగే చెప్పింది.

నాలుగ్గంటలకి ఇంటికి ఫోన్ చేసింది.

సర్వెంటు ఎత్తి, అయ్యగారు నిద్రపోతున్నారని చెప్పేడు.

"ఆయన వంట్లో ఎలాగ ఉంది?" అని అడిగింది అనూరాధ.

"అలాగే ఉంది...." అని, ఆమె పేరు, టెలిఫోన్ నంబరు, అడిగి తీసుకున్నాడు వాడు. ఇంకే వివరాలూ వాడినించి రాబట్టలేకపోయింది ఆమె.

సరళకి ఫోన్ చేద్దామనుకుంది. కాని ఆమెకి అనుమానం రావచ్చునని భయపడి, ఊరుకుంది. అయిదు గంటల దాకా ఏ ఫోన్ వచ్చినా తనకే ననీ, మేనేజరు సెక్రటరీ తనని పిలుస్తాడనీ అనుకుంది. కాని ఫోను రాలేదు. ఆమెలో ఆత్రుత ఎక్కువ అయింది.

ఆ పనీ, ఈ పనీ కల్పించుకుని మరో అరగంట ఆఫీసులోనే గడిపింది. అయిదున్నరకి నిరాశ చేసుకుని అస్తవ్యస్తమైన మనస్సుతో బయలుదేరబోతూ, ఆ సాయంత్రం అతని ఇంటికి వెళ్ళడానికి నిర్ణయించుకుంది. బయటికి వొచ్చే సరికి రోడ్ మీద కారులో రాజశేఖర్ ఉన్నాడు. ఆమెని చూసి, కిందకి దిగి, "హల్లో అనూ!" అన్నాడు.

ఆశ్చర్యంగా చూసింది అనూరాధ. అతను అప్పటి కన్నా కొంచెం చిక్కి ఉన్నాడు. కళ్ళు లోతుకి పోయాయి.

ఆమె మాట్లాడలేకపోయింది.

"కమాన్ ఇంటికి పోదాం" అంటూ అతను ఆమెని కారులో కూర్చోబెట్టేడు. డ్రైవరుతో ఇంటికి వెళ్ళమని చెప్పేడు. అడయారులో ఉన్న అతని ఇంటికి పది నిమిషాలలో చేరేరు. ఈ లోపున, "బాగున్నావా అనూ?" అని మాత్రం అడిగేడు. "మీరేం, అలాగ అయిపోయారు?" అంది అనూరాధ.

"కొంచెం వొంట్లో బాగు లేదు" అన్నాడు.

ఇంటికి చేరగానే మేడమీద బాల్కనీలోకి తీసికెళ్ళాడు రాజశేఖర్. అనూరాధకి కాఫీ, టిఫిన్ ఇచ్చి, "ఫోన్ చేశావుట! ఎందుకు?" అన్నాడు.

"మిమ్మల్ని ఒకసారి చూద్దా మనిపించింది" అంది అనూరాధ.

"గుడ్, నువ్వు ఇంతకుముందే వొస్తావనుకున్నాను" అన్నాడు రాజశేఖర్ అతను కాఫీ తాగుతున్నాడు.

"రావాల్సింది.... మీకు కృతజ్ఞత చెప్పాల్సింది. కాని.... అలాగే వాయిదావేస్తూ వొచ్చాను" అంది అనూరాధ.

"అందుకు కాదు రావడం.... ఫ్రెండ్‌గా."


"అదీని.... మీకు ఒంట్లో బాగులేదని చెప్పింది సరళ"

సిగరెట్ వెలిగించి, "అవున్లే-కొద్దిగా. ఇప్పుడు బాగానే ఉంది" అన్నాడు రాజశేఖర్.

"హాస్పిటల్‌కి వెళ్ళారా?"

"వెళ్ళాల్సి వొచ్చింది. డాక్టర్లంతా నాకు శత్రువులు. నో డ్రింక్. నో సిగరెట్. నో డిస్, నో దట్ అంటారు—





అవన్నీ అంటే నాకు నో లైఫ్.... అయినా, వెళ్ళాను— ఒకరు నన్ను బలవంతంచేసి వెళ్ళేలా చేశారు.... అందుకే ఈ మాత్రం బాగా ఉన్నాను".

ఆ బలవంతం చేసిందెవరో అతను చెప్పలేదు. అనూరాధ అడగలేకపోయింది. కానీ, అది తానే అయితే స్వీట్‌గా ఉండేదని ఆమెకి అనిపించింది.

"అయామాల్ రైట్. పదిహేను రోజులు టార్చర్. కానీ—మంచిదే అయిందిలే. కొంత బరువు తగ్గింది. దయట్... ఆ తమాషా జరుగుతూనే ఉంది. అయినా బ్రతికి ఏంచెయ్యాలి అనూ!.... ఈ ఇల్లు, నేను—అంతా" అని నిట్టూర్చి, "వేదాంతానికేంలే. అందరిలాగే నాకూ జీవితమంటే సరదా. నీ మాట చెప్పు.... ఆ హైదరాబాద్ ఉద్యోగం రాలేదా?" అన్నాడు.

"రాలేదు."

"వొస్తుందని అనుకోలేదు. అయినా అక్కడ నువ్వు ఉండలేవు. ఇక్కడే ఏదైనా మంచి ఉద్యోగం చూసుకో. నువ్వు కనపడలేదని ఊరుకున్నాను- ఈసారి చూస్తాను...."

"అక్కర్లేదండి మీకింకా శ్రమ ఇవ్వాలని లేదు...."

"శ్రమకేముంది! కాని, నాకో భయం అనూ.... నేను నీ పేరు చెప్పగానే అవతలివాళ్ళు ఒక నిర్ణయానికి వొచ్చేస్తారు. బజారునపడ్డ ఆడవాళ్ళతోనే ఎక్కువ పరిచయం నాకు. నీకూ తెలుసు.... నువ్వూ వాళ్ళలాగే అనుకుంటావు. అదీ నా భయం" అన్నాడు రాజశేఖర్.

"నేను పువ్వులంత పవిత్రురాలిని కాదు ... నలుగురికీ తెలిస్తే హేళన చేసే చిన్న చిన్న నిజాలు నా వెనకా ఉన్నాయి...." అంది అనూరాధ.

"ఉండొచ్చును. నువ్వూ మనిషివే-వయసులో ఉన్నావు. కాని— నా ఆడవాళ్ళలాగ ఒక ప్రయోజనం కోసం నువ్వేమీ చేసి ఉండవు. ఇపుడు ప్రేమయుగం ఒకవేపూ, వ్యభిచార యుగం మరోవేపూను. నువ్వూ నీలాటి పరిస్థితుల్లో ఉన్నవాళ్ళలాగే మోసపోయి ఉంటావు."

అనూరాధ మాట్లాడలేదు.

"ఈ యుగం అలాటిది. డబ్బుకోసం నాలాటి వాడి కోర్కెలు తీర్చేవాళ్ళు చాలా మంది ఉన్నారు. సలక్షణంగా అమ్మాయిని భాగస్వామిగా తీసుకోడానికే డబ్బు అడుగుతారు. దాన్ని ఏమనాలో తెలీదు- కాని, నీలాటి వాళ్ళు నలిగిపోతారు. అది మన మొరాలిటీ.... నువ్వందుకే నాకు నచ్చావు. నన్ను చెంప దెబ్బకొట్టేపాటి సంస్కారం నీలో ఉంది. నీ మీద ఎంత కోరికగా ఉండేదో తెలుసా? నీ దెబ్బకి ఆ కోరిక మరీ ఎక్కువ అయింది. హైదరాబాదులో అనుకోకుండా నువ్వు దొరకగానే ఆ కోరిక అవధులు దాటిపోయింది. కాని, అనూ.... నిన్ను పాడుచెయ్యాలని అనిపించలేదు. నీ గౌరవం మీద నీకు నమ్మకం ఉంది- ఆ రెండు రాత్రులూ నా టార్చర్ నీకు తెలీదు. కాని, అంతా ముగిసి నువ్వు వెళ్ళిపోయాక నాకు పెద్ద సంతృప్తి కలిగింది. నీ సంస్కారం అలాటిది...."

కొంచెం ఉద్రేకంగా అన్నాడు రాజశేఖర్.

"రెండో రోజు నువ్వు నిద్రమాత్రలు వేసుకోవొద్దన్నావు. నా మీద నీకు అంత నమ్మక.... నువ్వు చూడలేదు గాని.... కళ్ళు చెమర్చాయి తెలుసా?.... నాకు నిద్ర పట్టలేదు. నాలోని పశువు నిద్ర రానీలేదు. నువ్వు పాపలాగ హాయిగా నిద్రపోయావు.... మాత్రలు మింగి, మరో విస్కీతాగి.... నిద్రపోయాను."


ఆశ్చర్యంగా చూసింది అనూరాధ.

"మిమ్మల్ని చాలా బాధపెట్టేను" అంది.

"అవును.... అప్పటికే నేను మరో రకం బాధలో ఉన్నాను— నిప్పూ నిప్పూ కలిసినట్టు అయింది నా చుట్టూ— కాని చెప్పేనుగా, అంతా అయిపోయాక ఒక సంతృప్తి"

"పాపం! మీ స్మితకి- డిసపాయింట్‌మెంట్."

"ఆ అమ్మాయిని మరిచిపోలేదన్నమాట!- యునో— అది చాలా మంచిదైంది. ఆ ప్రిన్స్‌గాడు వాళ్ళమ్మని లోభ పెట్టి దాన్ని తెచ్చాడు. అదెవరినో ప్రేమించిందట. ఆనాడు తిరిగివెళ్ళి మర్నాడు తన బాయ్‌ఫ్రెండ్‌తో లేచిపోయి




రిజిష్ట్రీ మేరేజి చేసుకుంది.... లక్కీగర్ల్ నేరోగా తప్పించుకుంది.... ఆ పాపం నాకు అంటలేదు."

అతను సంతృప్తిగా అన్నాడు.

సర్వెంట్ విస్కీ గ్లాసూ, నీళ్ళూ తెచ్చేడు.

అతను కలుపుకుని, "ఏమవనీ.... నిన్ను చూసి చాలా సంతోషంగా ఉంది" అన్నాడు.

"కాని—మీరీ విస్కీ మానలేదు. డాక్టర్లు వొద్దన్నారుగా?" అంది అనూరాధ.

"అనూ! డాక్టర్లు చెప్పేది మన మంచికే చెప్తారు. మనం చేసేది— మన సుఖానికి చేస్తాం. అందుకు కాంప్రమైజ్ అయి, రోజుకి రెండుతో ఆగుతున్నాను. అదీ లేకపోతే లివర్ చిన్నబుచ్చుకుంటుంది!" అన్నాడు రాజశేఖర్.

కొంచెంసేపటికి నిశ్శబ్దం తరవాత, "మీరు— ఒంటరిగా ఎందుకు ఉన్నారు? మీ వాళ్ళెవరూ లేరా?" అంది అనూరాధ. అతని ప్రతీ మాటా తన కోరికని తెరల ముసుగుకి తోసేస్తూంది. అతన్ని చూసిన కొద్దీ ఆమెలో కోరిక ముందరకి వొచ్చే ప్రయత్నం చేస్తోంది. అతను చెప్తోన్నవన్నీ ఆ కోర్కెకి దోహదం చేస్తున్నాయి.

"వినాలని ఉంటే చెప్తాను...." అన్నాడు రాజశేఖర్.

అనూరాధ తల ఊపింది.

అతను విస్కీగ్లాసు రెండు చేతుల్లోకి తీసుకున్నాడు. రెండు అరచేతుల మధ్య దాన్ని కదుపుతూ, "మాది ప్రేమ వివాహం- తెలుసా. రాజేశ్వరి ఆమె పేరు. నేను ఒక ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకి అని ఢిల్లీ వెళుతూ ఆమెని కలిశాను రైల్లో. పది నిమిషాలలో మాటలు కలుపుకున్నాము.... అదంతా ఒక స్వీట్ డ్రీమ్...."

గ్లాసు కింద పెట్టేసి సిగరెట్ వెలిగించాడు రాజశేఖర్.

"సుడిగాలిలాటి ప్రణయం మాది.... ఢిల్లీలో పదిహేను రోజులు ఉండిపోయాను. రోజుకి పన్నెండు గంటలు రాజీ, నేనూ కలిసే ఉండేవాళ్ళం .... అనూ! మేం మాట్లాడుకున్న ప్రతీ మాటా, గడిపిన ప్రతీ నిమిషం నాకు ఇప్పటికీ జ్ఞాపకం ఉంది. నేను అమెరికాలో మేనేజిమెంటు చదివాను.... అదృష్టం కొద్దీ చదవడంలో చాలా గొప్పగా చదివాను. వాళ్ళిస్తామన్న పెద్ద ఉద్యోగం వొదులుకుని ఇండియా వొచ్చేను. ఎందుకో తెలుసా? నాన్నకి హార్ట్ ట్రబుల్. నే నొక్కడినే ఆయనకి. మా అమ్మ నా చిన్నతనంలోనే పోయింది. నాకు మద్రాసులో ఉద్యోగం ఇచ్చారు. నా ఫర్మ్ నీకు తెలుసుగా! అమెరికన్స్‌కి చాలా పెట్టుబడి ఉంది. వాళ్ళు నన్ను వెంటనే రమ్మన్నారు. రాజీని వొదల్లేక చివరికెలాగో వొచ్చేశాను- కాని, నా మనస్సంతా ఆమె మీదనే ఉంది. రోజూ రెండుసార్లు టెలిఫోన్‌లో మాట్లాడుకున్నా మా ఇద్దరికీ సంతృప్తి లేదు. ఈలోగా వాళ్ళ వాళ్ళు ఆమెకి మరో సంబంధం చూశారు. ఆ సంగతి తెలిసి ఢిల్లీ వెళ్లేను. రాజీ తల్లిదండ్రులతో మూడుగంటలు వాదించాను. లాభంలేక పోయింది. చివరకి ఆమెని అక్కడే రిజిష్ట్రార్ ఆఫీసులో పెళ్ళి చేసుకుని ఇక్కడికి వొచ్చేసి ఒక టెలిగ్రామ్ ఇచ్చాను వాళ్ళ వాళ్ళకి.

"మా నాన్న ఏమీఅనలేదు. మమ్మల్ని ఆశీర్వదించాడు. వారం తిరగకుండా తీర్థయాత్రలకని బయలుదేరారు. చాలా రెలిజియస్ ఆయన. అంతే. మళ్ళీ నేనాయన్ని చూడలేదు. కాశీలో గంగా స్నానంచేస్తూ మునిగిపోయారు.

"ఆ దుఃఖంనుంచి బయటపడ్డాక రాజీ, నేనూ మూడేళ్ళు స్వప్నలోకాల్లో గడిపాము. ఆమె బ్రదర్ ఒక్కడే ఎప్పుడైనా మా ఇంటికి వొచ్చేవాడు. కాని, మేము వేరే లోకం లేదన్నట్టు గడిపాము. ఆ మూడు సంవత్సరాలలోనూ నాకు రెండు ప్రమోషన్లు వచ్చాయి. మా రాధిక పుట్టింది.

"ఆ సమయంలో- నా వల్ల ఒక పొరపాటు జరిగింది.

"నాకు అప్పటికి రాజీతప్ప ఆడది తెలీదు.

"ఆమెకి ఏడో నెల వొచ్చాక నా దురదృష్టంకొద్దీ ఒక అమ్మాయితో స్నేహం అయింది. ఎవరిదో బర్త్‌డే పార్టీకి వెళ్ళాము. తిరిగి వొస్తూంటే ఆ అమ్మాయిని ఇంటి దగ్గర డ్రాప్ చెయ్యమన్నారు. వివరాలు అడక్కు. ఆమెని నేను కాదు తీసుకున్నది-ఆమె నాలో దాగిఉన్న దౌర్బల్యాన్ని సుళువుగా బయటికి తీసింది. నేను శారీరకంగా తప్ప ఆమెని కోరలేదు. రాజీ నా సర్వస్వమూ. కాని, ఆమె సుడిగాలిలాగ పెనవేసుకుంది నన్ను. రాజీకి దూరంగా ఉండడం— ఆమె అందుబాటులో ఉండడం.... ఆ వ్యవహారం ఆరేడు నెలలు సాగింది. అప్పటికి ఊరిలో అందరికీ తెలిసింది, రాజీకీ తెలిసింది.

"బేబీ పుట్టాక నాలుగు నెలలదాకా ఆమె వేరే గదిలో పడుకునేది. ఒకరాత్రి నా గదికి వొచ్చింది.

"సూటిగా అడిగింది — అదంతా నిజమేనాఅని.

నిజం ఒప్పుకున్నాను. పరిస్థితులు చెప్పాను. క్షమించమన్నాను. వాగ్దానాలు చేశాను. దేనికీ నేను సంశయించలేదు. తప్పు నాదిగదా!

కాని—రాజీ ఏమీ అనకుండా లేచి నిలబడి నామీద ఒక్క చూపు విసిరి, తన గదిలోకి వెళ్ళిపోయింది. ఆ చూపులోని అసహ్యం, బాధ, కోపం ఇప్పటికీ జ్ఞాపకం వొస్తూనే ఉంటాయి అనూ! నా మనస్సు పరిస్థితి ఎలాగ ఉందో ఊహించుకో. నేను చెప్పలేను.

"మళ్ళీ నేనా అమ్మాయిని చూడలేదు. ఆమె ఎక్కడికో వెళ్ళిపోయిందని చాలాకాలం తరవాత తెలిసింది.

"మళ్ళీ రాజీ నా గదికి రాలేదు.

"రాధికకి ఒక సంవత్సరం నిండిందని పండగ చేద్దామన్నాను. ఆమె 'మీ ఇష్టం' అంది. పెద్ద పార్టీ ఇచ్చాను. అందరూ వొచ్చారు. ఆమె చాలా నార్మల్‌గా ప్రవర్తించింది. బేబీకి నేనంటే ఎంతో ప్రేమ. చూడగానే అమ్మని వొదిలి కూడా నా దగ్గరకి వొచ్చేది. "డాడీ" అది మొట్టమొదట నేర్చుకున్న మాట. రాజీకి అసూయ ఉండేవి కాదు. నాకూ, బేబీకి ఉన్న అనుబంధం గురించి ఆమె ఎవరికేనా చెప్తూనే ఉండేది.

"మరో ఆరు నెలలలాగే గడిచిపోయాయి. బయటివాళ్ళెవరికీ మా గొడవ తెలీదనుకున్నాను. కాని ముగ్గురు నలుగురు నౌకర్లు పనిచేసే ఇంట్లో రహస్యాలేమిటి ఉంటాయి?

"నేను రాజీతో చాలా ప్రయత్నించాను. కాని, ఆమె అచంచలంగా ఉండిపోయింది. మా విషయం నేను ప్రస్తావిస్తే లేచి వెళ్ళిపోయేది. అలాగ సుమారు ఒక సంవత్సరం నేను ఒంటరిగా ఉండిపోయాను. నా సెక్రెటరీ ఉండేది. ఆమె కివన్నీ ఎలాగ తెలిశాయో.... చివరికి ఆమెతో తిరగడం మొదలు పెట్టేను. వీలైనంత రహస్యంగానే ఉంచినా ఈ కథకూడా రాజీ వింది.

అడగ్గానే నేను నిజమేనని చెప్పేను.


ఆ మర్నాడు ఆమె హైదరాబాద్ వెళ్ళిపోయింది. నేనా ఉదయమే కలకత్తా వెళ్ళాను. తిరిగి వొచ్చేసరికి ఒక ఉత్తరం నా బెడ్‌మీద ఉంది. బ్రదర్ దగ్గరకి వెడుతున్నాననీ, నెలకొక సారి వొచ్చి బేబీని చూడవచ్చుననీ. అంతేకాదు— కావలిస్తే విడాకులు తీసుకొమ్మనీ. అంతే.

అప్పటినించీ నాకు రాజీమీద ద్వేషం రగులుకుంది. ఆమెకి రెండు ఉత్తరాలు రాశాను. విప్పకుండానే రిటర్న్ చేసింది. నేను వెళ్ళేటప్పుడు ముందుగా తెలియజేస్తే ఆమె కనిపించకుండా జాగ్రత్తపడుతుంది. బేబీని ఎక్కడికీ తీసికెళ్ళకూడదు.... సాయంత్రం ఆరయేసరికి వెళ్ళిపోవాలి. నెలకొక్కసారే అనుమతి....

బేబీకి పన్నెండేళ్ళప్పుడు నిండాయి.

రాజీ ఆమెనీ దూరంచేసింది. ఈ నాలుగు నెలలలోనూ ఒక్కసారి.... అదీ కేవలం అరగంట— రాధికతో గడిపేను. బహుశా మున్ముందు ఆమాత్రం లేకుండా చేస్తుంది రాజీ. నామీద ఏమి చెపుతోందో! మొన్నమొన్నటిదాకా నన్ను చూడగానే ఎగిరి గెంతువేసే పాప ఇప్పుడెంతో పొడిగా పలకరిస్తోంది. యస్ డాడీ! ఓ. కే. డాడీ అంతే. నన్నుచూస్తే పువ్వులాగ నవ్వేపిల్ల మొగ్గలాగ ముడుచుకుపోతోంది.... అనూ! అదీ నా కథ.

"నేనంతగా తాగేవాణ్ని కాదు. కానీ రాజీ ధర్మమా అని తాగడం మొదలుపెట్టేను. ఆమెనెంతగా ప్రేమించానో అంతగా ద్వేషించాను.... నిజమే ఆడవాళ్ళని రోజుకొకరన్నట్టు వాడుకున్నాను. అయితే, అందరూ కావాలని వొచ్చినవాళ్ళే అనూ!— నేను మోసం చేసీ, బలవంతం చేసీ ఎవర్నీపాడు చెయ్యలేదు. సారీ! ఆనాడు నిన్ను కొట్టేను. కోపం నీ మీద కాదు.... నా మీద. బురదలో మునిగిన వాడికి తెల్లబట్టలంటే ఉండే కోపంలాటిది.... నువ్వు క్షమించావని తెలుసు. థాంక్స్!"




అతను అలిసిపోయాడు.

విస్కీ సగం గ్లాసు తాగాడు. "నువ్వెందుకొచ్చావివాళ? ఉన్న సంగతి చెప్పు" అన్నాడు.

ముందర గొంతుక విడలేదు అనూరాధకి.

ఎలా చెప్పాలో తెలియలేదు.

"మీ కోసం—వొచ్చాను" అంది చివరికి. "మీతో-ఉండాలని."

మిగిలిన గ్లాసు పూర్తిచేసి, మళ్ళా విస్కీ వేసుకుని "నిజంగా?" అన్నాడు రాజశేఖర్.

"అవును...."

"గాడ్!" అన్నాడు రాజశేఖర్. కొంచెం ఊరుకుని, "చూడు అనూ! నిజం చెప్పు నీకు నేను కావాలని వొచ్చావా?... లేక.... మగవాడు కావాలని వొచ్చావా?" అన్నాడు.

అనూరాధ మాట్లాడలేదు. తల వొంచుకుని కూర్చుంది. ఆమెకి అక్కడినుంచి మాయం అయిపోవాలని ఉంది. ఈ పరిస్థితిని ఆమె ఊహించుకోలేదు. అతనలా నిర్మొహమాటంగా అడుగుతాడనీ ఆమె అనుకోలేదు. ఆ ప్రశ్నకి ఆమెకి జవాబు తెలుసును అందుకే ఏమీ చెప్పలేకపోయింది.

"నువ్వు సిగ్గుపడినందుకు నాకు సంతోషంగా ఉంది. నా మూలాన్న నువ్వు కూడా నా ఆడవాళ్ళలాగే మారి ఉంటే ఇక్కడే షూట్ చేసుకుని చచ్చిఉండేవాడిని...."

అతనికి ఆయాసం వొచ్చింది.


విస్కీ తాగబోయాడు. దగ్గు వొచ్చింది. గ్లాసు చేతిలోనించి కింద పడింది. అతనికి చెమట పోసేస్తోంది.

గాభరాగా అనూరాధ కిందకి పరిగెట్టింది. సర్వెంటు వచ్చాడు. అతనూ, ఆమె కలసి రాజశేఖర్‌ని మంచంమీద పడుకోబెట్టేరు. అతని ముఖం తుడిచి షర్టు బటన్స్‌తీసి ఫేన్ పెట్టింది ఆమె.

రెండు నిమిషాల్లో అతను కోలుకున్నాడు.

"డాక్టర్‌ని పిలిచేదా?" అంది అనూరాధ.

"వొద్దు.... ఆ మాత్ర లిలా ఇయ్యి" అని టేబిల్ చూపేడు. రెండు మాత్రలు అతనికిచ్చి నీళ్ళు తాగించింది అనూరాధ. అతను లేచే ప్రయత్నం చేసేసరికి మళ్ళీ చెమట పట్టింది. వెనక్కి జారబడి, "అలసిపోయానంతే— డోంట్ వర్రీ—" అంటూ, దిండు కిందనించి డైరీతీసి, వేలితో ఒక




ఫోన్ నంబరు చూపి "పిలూ, రమ్మను" అన్నాడు.

"డాక్టర్నీ...." అంది అనూరాధ.

"నో.అతన్ని పిలూ...." అన్నాడు. అతనిలో ఇందాక కనిపించిన నీరసం కొంత తగ్గింది

అతని బెడ్‌పక్కనే టెలిఫోన్ ఉంది.

నంబర్ డయల్ చెయ్యగానే అవతల చంద్రం మాట్లాడేడు. "నేను రాజశేఖర్ ఇంటినించి మాట్లాడుతున్నాను. మీరు వెంటనే రండి.... ఆయన పిలవమన్నాడు" అంది అనూరాధ. ఆమెకి అతని గొంతుక తెలిసింది. కాని, అతను గుర్తుపట్టలేదు.

"ఆయన ఎలా ఉన్నారు?" అన్నాడు చంద్రం ఆతృతతో.

"బాగానే ఉన్నారు. కొంచెం అలిసి ఉన్నారు."

"వెంటనే వొస్తాను" అన్నాడు చంద్రం.

ఫోన్ పెట్టి, "ఎలా ఉంది?" అంది అనూరాధ. అతని ముఖం కళావిహీనంగా ఉంది.

"బాగానే ఉంది- నో వర్రీ– చంద్రం వస్తాడు. నువ్వు వెళ్ళు."

"ఫరవాలేదు.... చంద్రం మీకెలాగ తెలుసు?"

"నీకు చెప్పేడుగా! అతనికి విరుద్ధంగా సాక్ష్యం ఇచ్చి జెయిలుకి పంపేను- దానికి నామీద కోపపడడానికి బదులు నన్ను గురువుగా స్వీకరించిన మనిషి...."

ఆశ్చర్యంగా చూసింది అనూరాధ.

"మీరా?" అంది.

"అవును అనూ! అలాటి వాళ్ళు ఎక్కడో, ఎప్పుడో గాని దొరకరు... వాడి దురదృష్టం- నీకు ఇష్టం కాలేదు. పిటీ.. కాని, చాలా మంచివాడు."

"నా విషయం తెలుసునా?"

"చెప్పేను. మువ్వెవరో తెలియకుండా నువ్వంటే ఇష్టపడ్డాడు. నా దగ్గర రహస్యం లేదతనికి. అతని దగ్గర నేనూ ఏమీ దాచను."

అతనికి మళ్ళీ ఆయాసం వచ్చింది.

అతను కళ్ళు మూసుకుని పడుకున్నాడు. నీరసంగా ఉన్నాడు. ఆమెకి భయంగా ఉంది. డాక్టర్ నంబరు కోసం డైరీ వెతికింది. కాని కనపడలేదు.

బయట స్కూటర్ ఆగిన చప్పుడైంది. చంద్రం పరిగెట్టుకుని మీదకి వచ్చాడు. వొస్తూనే రాజశేఖర్ పక్కన కూర్చుని, "మీకేం ఫరవాలేదు- నర్సింగ్ హోమ్ నించి ఏంబులెన్స్ వొస్తోంది" అన్నాడు.

రాజశేఖర్ నీరసంగా నవ్వి చంద్రం చేతులు పట్టుకుని, "నాకు భయం ఏమీలేదు, నువ్వు ఉన్నావు...."అన్నాడు. వాళ్ళిద్దరూ తండ్రీ కొడుకుల్లాగ ఉన్నారు. చంద్రం తన ఉనికిని కూడా గమనించకుండా రాజశేఖర్ మీద దృష్టి నిలపడం అనూరాధ గ్రహించింది. ఆమెకి కళ్ళు చెమర్చాయి.

రెండు నిమిషాలు గదిలో నిశ్శబ్దంగా గడిచిపోయింది. రాజశేఖర్ చెయ్యి ఎత్తి అనూరాధని చూపెడుతూ, "చాలా భయపడుతోంది- ఇది సీరియస్ కాదని చెప్పు" అన్నాడు చంద్రంతో.

అప్పుడు చూశాడు చంద్రం ఆమెని.

"మీరెలాగ వొచ్చారు?— మీరేనా టెలిఫోన్ చేశారు?" అన్నాడు.

"అవును- ఆయన్ని చూడాలని వొచ్చేను. ఆ రోజు హైదరాబాదులో సాయం చేశాక మళ్ళీ కలువలేదు...."

ఇంతట్లో ఏంబులెన్స్ వొచ్చింది. సర్వెంటు, చంద్రం కలిసి రాజశేఖర్ని కిందికి తీసికెళ్ళేరు. అనూరాధ నిస్పృహయంగా వాళ్ళవెనుక నడిచి వెళ్ళింది.

నిమిషంలో చంద్రం, రాజశేఖర్, ఏంబులెన్స్‌లో వెళ్ళిపోయారు. ఎక్కడికో కూడా అడిగి తెలుసుకోలేదు అనూరాధ. ఆమె మనసంతా మరీ కల్లోలంగా ఉంది.

సర్వెంటుని అడుగుదా మనుకుంటే కారు వొచ్చింది. అది రాజశేఖర్‌దే.

"హాస్పిటల్‌కి వస్తారా?" అన్నాడు.

"అవును...."

"పదండి."

అక్కడికి చేరేసరికి పది నిమిషాలు పట్టింది, అప్పటికి రాజశేఖర్‌ని ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో పెట్టేరు. చంద్రం బయట నిలబడ్డాడు.

"ఎలా ఉంది? డాక్టర్ ఏమన్నాడు?" అని అడిగింది అనూరాధ. కన్నీళ్ళు ఆపుకోడం ఆమెకి కష్టంగా ఉంది.

"హార్ట్ ఎటాక్– అంతే చెప్పేరు.... మరో గంట, రెండు గంటలదాకా ఏమీ తెలీదు" అన్నాడు చంద్రం.అప్పటిదాకా గంభీరంగా ఉన్న అతని ముఖం ఒక్కసారి దుఃఖంతో నిండిపోయింది. వరండా చివర ఉన్న బెంచీమీద కూర్చున్నారిద్దరూ. కళ్ళు తుడుచుకున్నాడు చంద్రం.

"ఆయన—చెడ్డవాడు కాదు. రాజేశ్వరిమీద ఆయనకి ఇప్పటికీ ప్రేమ ఉంది....దానిలోనించే ద్వేషం పుట్టి అది ఆడవాళ్ళమీద తీర్చుకున్నాడు.... కాని, రాధిక దూరమవడంతో అతనికి నిజంగానే గుండె పగిలిపోయింది" అన్నాడు తనతో తానే మాట్లాడుకుంటోన్నట్టు.

"ఆ[illegible] కథ—అంతా చెప్పేరు ఇవేళ...."

అతను తల ఊపేడు.

డాక్టరు బయటికి వొచ్చి భయం లేదని చెప్తాడేమోనని ఆశ.

డాక్టరు బయటికి వొచ్చి ఏమీ చెప్పకుండానే దుర్వార్త తెస్తాడని భయం.

అలాగ అరగంట గడిచేక అనూరాధ తట్టుకోలేక పోయింది.

"మీకు—రాజేశ్వరి నంబరు తెలుసునా?" అంది.

"తెలీదు....అది ఆయన డైరీలో ఉంది."

"నేను మాట్లాడతాను. బేబీని తీసుకొస్తే ఏమైనా లాభం ఉంటుందేమో" అంది అనూరాధ.

"ఆవిడ రాదు...."

"ఈ సంగతి తెలిస్తే...."

"అయినా వొస్తుందనుకోను. కాని, ప్రయత్నించండి. డైరీ ఆ టేబిల్‌మీదనే ఉంది...."

కారులో అతని ఇంటికి వెళ్ళింది అనూరాధ.

నంబరు దొరికింది. డయల్ చేసింది. అవతల ఒక మగ గొంతుక "హల్లో" అంది.

తనని పరిచయం చేసుకుని. "రాజేశ్వరిగారితో మాట్లాడాలి—రాజశేఖర్ గారిని గురించి" అంది అనూరాధ.

"ఏమని? మీరెవరు?" అన్నాడాయన, కటువుగా.

"ఆయనకి హార్ట్ ఎటాక్ వొచ్చింది— హాస్పిటల్లో ఉన్నారు."

"ఎప్పుడు?"

"గంటన్నర అయింది...."

"ఏ హాస్పిటలు?"

అనూరాధ నర్సింగ్ హోమ్ పేరు చెప్పింది.

"సరే...." అన్నాడతను.

"ఆయన- బేబీ కోసం బెంగపెట్టుకున్నారు. దయచేసి వాళ్ళిద్దరినీ పంపండి."

"ఆమెకి చెప్తాను.... మీరెవరు మాట్లాడుతున్నారు?" అన్నాడు అతను.

"నేను- ఆయన శ్రేయోభిలాషిని. అంతే. రాజేశ్వరి గారికీ శ్రేయోభిలాషిని... దయచేసి వాళ్ళని రమ్మనండి."

"ప్రయత్నిస్తాను" అని ఫోన్ పెట్టేశాడు.

అతని గొంతుకలో ఆశాజనకంగా ఏమీ లేదు.

నీరసంగా కూర్చుని ఆలోచనలో పడింది అనూరాధ. రాజశేఖర్ చెప్పినవన్నీ విన్నాక ఆమెకి కొత్త జీవితం ప్రారంభించినట్టు ఉంది. అతనిలో తాను రెండు రకాల మనిషిని చూసింది. తనలోని దౌర్బల్యం బయటికి వొచ్చినప్పుడే అతనిలోని ఉన్నతి తెలిసివొచ్చింది. అతని జీవితం ఈ రోజుతో ముగుస్తుందా? అలా ఆలోచిస్తూంటే చంద్రం హాస్పిటల్‌నించి ఫోన్ చేశాడు. "ఈ రాత్రి భయంలేదు— మీరు ఇంటికి వెళ్ళండి. రేపు రండి-వీలైతే" అన్నాడు.

"మీరు?"

"ఇక్కడే ఉంటాను. ఇంటికి వెళ్ళినా,ఉండలేను."

ఆలోచించి "సరే" అంది అనూరాధ. ఆమె బాగా అలిసిపోయింది.

"కారులో వెళ్ళండి. హైదరాబాద్.... మాట్లాడేరా?"

వివరాలు చెప్పి ఇంటికి బయలుదేరింది అనూరాధ. వెడుతూ వెడుతూ టేబిల్ మీద ఉన్న సీసాలోనించి రెండు నిద్ర మాత్రలు తీసుకుంది.తనకి ఆ రాత్రి నిద్ర పట్టదని తెలుసు.

## 7

మర్నాడు ఆమె లేచేసరికి తొమ్మిది దాటింది. నిన్న ఇంటికి రావడంతోనే అమ్మ పురాణం మొదలుపెట్టడం, తానేమీ వినకుండా మాత్రలు వేసుకుని నిద్రపోవడం మాత్రం ఆమెకి జ్ఞాపకం ఉంది.

రాత్రి ఏమి జరిగిందో పూర్తిగా జ్ఞాపకం వొచ్చేసరికి ఆమె గుండెలో రాయి పడినట్టు అయింది. ఈ పాటికి....

ఇరవై నిమిషాలలో తయారై. ఆటోలో అక్కడికి చేరింది.

చంద్రం అక్కడే ఉన్నాడు.

"ఆయన.... ఎలా ఉన్నారు?" అంది ఆత్రంగా.

"అలాగే— ఏమీ మార్పులేదు" అన్నాడు చంద్రం. అతనికి రాత్రి అంతా నిద్రలేదని తెలుస్తోనే ఉంది. అతని బట్టలు నలిగిపోయాయి.

"మీరు- ఇంటికి వెళ్ళండి నేను ఉంటాను. డాక్టర్ ఏం చెప్పినా ఫోన్ చేస్తాను" అంది అనూరాధ.


అతను సంశయించాడు. ఆమె అతనికి నచ్చచెప్పి. ఇంటికి పంపింది.

అతను వెళ్ళాక పక్కనే ఉన్న కేంటీన్‌కి వెళ్ళి కాఫీ తాగి వొచ్చింది.

అప్పుడు చూసింది రాజేశ్వరిని. ఆమె పక్కన రాధిక. రాజేశ్వరి ఒక డాక్టరుతో ఏదో మాట్లాడుతోంది. అతను ఆమెని కూర్చోమని చెప్తున్నాడు. ఆమె చెయ్యి పట్టుకునిఉంది రాధిక. వాళ్ళిద్దరూ వొచ్చి అనూరాధ పక్కన కూర్చున్నారు. తనకి అనుమానం లేకపోయినా, "మీరు- రాజేశ్వరిగారే కదూ?" అని అడిగింది అనూరాధ.

"అవును....మీరు——"

"నిన్న టెలిఫోన్ చేసిన అనూరాధని. మీరు రావడం-






ఆయనకి చాలా మంచిది. పాపని చూస్తే ఆయనకి నయమౌతుంది" అంది అనూరాధ చాలా ఆనందంగా.

"పాప—అతని దగ్గరకి పోదు. దాని కిష్టంలేదు" అంది రాజేశ్వరి పొడిగా.

"కాని...."

రాజేశ్వరి మాట్లాడలేదు. డాక్టరు వొచ్చి, "మధ్యాహ్నం నాలుగ్గంటలకు రండి- అప్పటికి తెలివివొస్తుంది. చూద్దురుగాని" అన్నాడు. వెంటనే రాజేశ్వరి రాధికని తీసుకుని వెళ్ళిపోయింది.

అనూరాధ ఆశ్చర్యపోయింది. ద్వేషం ఇంత గాఢంగా ఉండగలదని ఆమెకి తెలీదు. కాని, రాజేశ్వరి ఎందుకు వొచ్చిందో ఆమెకి అర్థం కాలేదు.

రెండు గంటలకి చంద్రం వొచ్చాడు. జరిగింది అతనికి చెప్పి తన అనుమానాన్ని తెలియజేసింది అనూరాధ. "లోకానికి ఆ మాత్రం భయపడి ఉంటుంది! లేకపోతే ఆ బ్రదర్ వెళ్ళమని ఉంటాడు" అన్నాడు చంద్రం ఆలోచించి.

రాజేశ్వరి సరిగ్గా నాలుగ్గంటలకి వొచ్చింది. ఆమెనీ, పాపనీ లోపలికి తీసికెళ్ళాడు డాక్టర్. నిమిషంలో బయటికి వొచ్చి, "అనూరాధా, చంద్రం మీరేనా? మీరూ రండి. ఆయన పిలుస్తున్నారు" అన్నాడు.

ఇద్దరూ లోపలికి వెళ్ళేరు. రాజేశ్వరి అతని మంచానికి అటువైపు నిలబడింది. బేబీ ఆమె వెనకాల నిలబడి ఉంది. "కమాన్! నేను బాగానే ఉన్నాను. పాపం రాజీకి అంతశ్రమ ఎందుకిచ్చారు?" అన్నాడు.

"మాట్లాడకండి" అది నర్సు.

"వన్ మినిట్ సిస్టర్!.... అని, "బేబీ! ఒక్కసారి ఇటు రామ్మా!" అన్నాడు.

బేబీ అతనిదగ్గరికి రాలేదు. రాజేశ్వరి నిశ్చలంగా నిలబడింది.

రాజశేఖర్ మళ్ళీ పిలిచేడు "రాధికా! డాడీమీద కోపమా?" అన్నాడు.

రాధిక అటుతిరిగి నిలబడిపోయింది. మాట్లాడలేదు. కదలలేదు. రెండు బరువైన నిమిషా లలాగే గడిచిపోయాయి.

"నేను వెడతాను" అంది రాజేశ్వరి. ఆమె ముఖం ఎర్రగా ఉంది. వెనుతిరిగి చూడకుండా ఆమె వెళ్ళిపోయింది. తండ్రివైపు చూడకుండా బేబీ కూడా వెళ్ళిపోయింది. రాజశేఖర్ కళ్ళనించి ఒక్కసారి నీళ్ళు వొచ్చాయి. తుడిచి, "ప్లీజ్! రిలాక్స్" అంది సిస్టర్.

అతను చిరునవ్వు నవ్వే ప్రయత్నం చేశాడు. "రాధికా! ఇలా రామ్మా!" అన్నాడు అనూరాధవైపు చూస్తూ.

ఆమె తెల్లబోయింది. భయపడింది.

"భయపడకు....నాకో రాధిక కావాలి. అది నువ్వే...." అన్నాడు. బోధపడి, ఏడుపు ఆపుకోలేకపోయింది అనూరాధ.

ఆమె చెయ్యి తన చేతిలోకి తీసుకుని ప్రేమగా ఆమె కళ్ళల్లోకి చూశాడు రాజశేఖర్. చంద్రం ముఖంలో చిరునవ్వు మళ్ళీ వొచ్చింది.

"ఏడవకు రాధా...." అన్నాడు రాజశేఖర్. అనూరాధ కళ్ళు తుడుచుకుంది.

"ప్లీజ్ లీవ్ హిమ్" అంది నర్సు.

రాజశేఖర్ అనూరాధ చెయ్యి వొదిలిపెట్టి, ఇంటికెళ్ళు-రేపురా. నేనిక్కడే ఉంటాన్లే" అన్నాడు. "నువ్వూను" అన్నాడు చంద్రాన్ని. ఇద్దరూ బయటికి వొచ్చారు.

చంద్రం దగ్గరకి డాక్టరు వొచ్చి, అతని టెలిఫోన్ నంబరు తీసుకుని, "ఇంక అతన్ని సెడేషన్‌లో ఉంచుతాం. నో మోర్ సీన్స్.... క్రిటికల్‌గా ఉంది ఇంకా. రేపు రండి" అన్నాడు.

ఒకసారి వెనక్కి తిరిగి చూసి చంద్రం రోడ్డుమీదకి వచ్చాడు. అతని వెనకాలే అనూరాధా వొచ్చింది.

చిన్న చినుకులు పడుతున్నాయి.

"పదండి బస్‌స్టాప్‌లో డ్రాప్‌చేస్తాను" అన్నాడు చంద్రం స్కూటర్ స్టార్ట్‌చేస్తూ.

"ఇంటికి తీసికెళ్ళండి - తడిసినా ఫరవాలేదు" అంది అనూరాధ. తడిగా వొచ్చాయి ఆ మాటలు.

ఇద్దరూ ఇంటికి బయలుదేరేరు.